

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 09-11-2025 | సంపుటి - 25 | సంచిక -174 | రూ : 4 | పేజీలు: 8







2లో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక..
# హైదరాబాద్ సీపీ కీలక ఆదేశాలు

- జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై పోలీసుల ప్రత్యేక ఆంక్షలు
- మద్యం దుకాణాలు, హోటళ్లు మూసివేత
- నియోజకవర్గం పరిధిలో 144 సెక్షన్ విధింపు
- పోలింగ్ కేంద్రాల వద్ద ఐదుగురికి మించి గుమికూడొద్దు
- ఓట్ల లెక్కింపు రోజు టపాసులు పేల్చడంపై నిషేధం

## పార్లమెంట్ శీతాకాల సమావేశాల
# తేదీలు ఖరారు.. రాష్ట్రపతి ఆమోదం

- డిసెంబర్ 1 నుంచి 19 వరకు సెషన్ నిర్వహణ
- ప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం
- ఫలప్రదమైన చర్చ జరగాలని ఆశిస్తున్నట్టు కిరణ్ రిజిజు ట్వీట్



2లో



2లో

## ఫేక్ ప్రచారం పట్ల
# అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి ప్రజాప్రతినిధి వారానికోసారి 'ప్రజా వేదిక' నిర్వహించాలని స్పష్టీకరణ
- కొత్తగా వచ్చిన వారి కన్నా పార్టీ సీనియర్లకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- పింఛన్లు, సంక్షేమ కార్యక్రమాల్లో నేతలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశం
- ప్రతి ఒక్కరి పనితీరుపై తన వద్ద సమాచారం ఉందన్న ముఖ్యమంత్రి



2లో

# రేవంత్ కు చంద్రబాబు, స్టాలిన్, సోనియా, రాహుల్, చిరంజీవి, డీకే శుభాకాంక్షలు

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి వెల్లువెత్తిన పుట్టినరోజు శుభాకాంక్షలు
- ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పిన సోనియా, రాహుల్ గాంధీ
- పార్టీలకు అతీతంగా నేతల శుభాకాంక్షలు



2లో

# మహిళల వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా వికెట్ కీపర్ రిచా ఘోష్ కు డీఎస్పీ జాబ్




# అందరినోటా జూబ్లీహిల్స్..!

- నేటితో ఉప ఎన్నిక ప్రచారానికి తెర
- అహరహం శ్రమిస్తున్న కాంగ్రెస్, భారాస, భాజపా

హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ రేకెత్తిస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రచారం పతాక స్థాయికి చేరింది. భారాస, కాంగ్రెస్, భాజపా అహరహం శ్రమిస్తున్నాయి. ఆదివారం సాయంత్రంతో ప్రచారానికి తెరపడనుంది. ఈ నెల 11న పోలింగ్ జరగనుండగా 14న ఫలితం తేలనుంది. మొత్తం 58 మంది అభ్యర్థులు రంగంలో ఉండగా ప్రధానంగా భారాస, కాంగ్రెస్, భాజపాల మధ్య పోటీ నెలకొంది. భారాస ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆయన భార్య మాగంటి సునీత పోటీ చేస్తుండగా.. అధికార కాంగ్రెస్ నుంచి నవీన్‌యాదవ్, భాజపా నుంచి లంకల దీపక్‌రెడ్డి బరిలో తరువాయి 2లో

# మహిళల వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా వికెట్ కీపర్ రిచా ఘోష్ కు డీఎస్పీ జాబ్

వరల్డ్ కప్ గెలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు వికెట్ కీపర్/బ్యాటర్ రిచా ఘోష్‌కు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉన్నతోద్యోగం ఇచ్చింది. ఆమెను రాష్ట్ర పోలీస్ శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ (డీఎస్పీ)గా నియమించింది. శనివారం కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా రిచాకు నియామక పత్రాన్ని అందజేశారు. మహిళల ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యురాలైన రిచా ఘోష్‌ను సత్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిచాపై ప్రశంసలు, బహుమతుల వర్షం కురిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమెను ప్రతిష్ఠాత్మక 'బంగ భూషణ్' అవార్డుతో సత్కరించింది. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (క్యాబ్) తరఫున సీఎం మమత ఆమెకు బంగారు బ్యాట్, బంతిని బహూకరించారు. దీంతో పాటు క్యాబ్ రూ. 34 లక్షల చెక్కును కూడా రిచాకు అందించింది. ఈ కార్యక్రమంలో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ కూడా పాల్గొన్నాడు. ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో రిచా 34 పరుగులు చేసినందుకే, ఆమెకు రూ. 34 లక్షల చెక్కును అందించినట్లు గంగూలీ వివరించాడు. "ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు రిచా బాధ్యత చాలా కష్టమైనది. ఆడటానికి తక్కువ బంతులు ఉన్నాయి, అవసరమైన రన్ రేట్ కూడా ఎక్కువగా ఉంది. అయినప్పటికీ, ఆమె నైపుణ్యంతో ఆడి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది" అని గంగూలీ అన్నారు. భవిష్యత్తులో రిచా భారత మహిళల క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా నాయకత్వం వహిస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, గంగూలీ ఇద్దరూ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సన్మానంపై రిచా ఘోష్ స్పందించింది. "నెట్ ప్రాక్టీస్ సమయంలో నేను ఎప్పుడూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుంటాను. అది నాకు చాలా సహాయపడుతుంది. కష్టమైన పరిస్థితుల్లో సవాళ్లను స్వీకరించడం నాకు ఇష్టం. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించడాన్ని నేను ఆస్వాదిస్తాను" అని ఆమె తెలిపారు. ఇదే కార్యక్రమంలో మమతా బెనర్జీ, సౌరవ్ గంగూలీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "గంగూలీ ఎన్నో ఏళ్లు భారత జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. క్రికెట్ పరిపాలనను కూడా సమర్థంగా నిర్వహించాడు. అలాంటి వ్యక్తి ఐసీసీకి అధిపతిగా ఉండాలి. ఏదో ఒక రోజు అతను ఆ పదవిని అందుకుంటాడని నేను నమ్ముతున్నాను. అతన్ని ఎవరూ ఆపలేరు" అని మమత పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక... హైదరాబాద్ సీపీ కీలక ఆదేశాలు

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికను పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు వీలుగా నియోజకవర్గ వ్యాప్తంగా కఠిన ఆంక్షలు విధిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఉపఎన్నిక పోలింగ్ సందర్భంగా ఈ నెల 9వ తేదీ (ఆదివారం) సాయంత్రం 6 గంటల నుంచి 11వ తేదీ (మంగళవారం) సాయంత్రం 6 గంటల వరకు నియోజకవర్గం పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్బులను పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు జరగనున్న 14వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఈ ఆంక్షలు మళ్లీ అమల్లో ఉంటాయని వివరించారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటంపై నిషేధం విధించారు. అదేవిధంగా, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై టపాసులు పేల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం వంటి వాటిపై నిషేధం ఉంటుందని తెలిపారు. పోలీసు ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

## పార్లమెంట్ శీతాకాల సమావేశాల తేదీలు ఖరారు..
## రాష్ట్రపతి ఆమోదం

పార్లమెంట్ శీతాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈ తేదీలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ప్రకటిస్తూ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఫలప్రదమైన, అర్థవంతమైన చర్చలు జరగాలని ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అత్యంత క్లుప్తమైన శీతాకాల సమావేశాల్లో ఇది ఒకటి కావడం గమనార్హం. గతేడాది శీతాకాల సమావేశాలు నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20న ముగిశాయి. 26 రోజుల వ్యవధిలో లోక్‌సభ 20 సార్లు, రాజ్యసభ 19 సార్లు సమావేశమయ్యాయి. ఆ సెషన్‌లో లోక్‌సభ ఉత్పాదకత 54.5 శాతంగా, రాజ్యసభ ఉత్పాదకత 40 శాతంగా నమోదైంది. అప్పుడు ఐదు బిల్లులను ప్రవేశపెట్టగా, 'భారతీయ వాయుయాన్ విధేయక్ 2024' బిల్లును ఉభయ సభలు ఆమోదించాయి. ఇటీవల జరిగిన వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు 21 రోజుల పాటు జరిగాయి. ఆ సమావేశాల్లో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో ఉభయ సభల్లో ఉత్పాదకత గణనీయంగా తగ్గింది. లోక్‌సభ కేవలం 31 శాతం, రాజ్యసభ 38.8 శాతం ఉత్పాదకతను మాత్రమే నమోదు చేశాయి. ఆ సెషన్‌లో 15 బిల్లులు చట్టరూపం దాల్చాయి.

## రేవంత్ కు చంద్రబాబు, స్టాలిన్, సోనియా, రాహుల్, చిరంజీవి, డీకే శుభాకాంక్షలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పుట్టినరోజు జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రాజకీయ, సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి కాంగ్రెస్ అగ్రనేతల వరకు పలువురు జాతీయ నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా వేదికగా అభినందనల సందడి నెలకొంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ స్వయంగా రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఆయనకు విషెస్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తమిళనాడు సీఎం స్టాలిన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల, మెగాస్టార్ చిరంజీవి, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ తదితరులు సీఎం రేవంత్‌కు విషెస్ తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు కూడా పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ఆయనకు శుభాకాంక్షలు చెబుతున్నారు.

## అందరినోటా జూబ్లీహిల్స్..!

(మొదటిపేజీ తరువాయి)

**అభివృద్ధి.. సంక్షేమ నినాదంతో కాంగ్రెస్**

అధికార కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఎన్నికల ప్రచార బాధ్యతలను చేపట్టారు. జూబ్లీహిల్స్‌లో గెలిచి కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని రుజువు చేయాలనేది లక్ష్యం. అభివృద్ధి.. సంక్షేమ నినాదం చేస్తున్నారు. నాలుగు రోజులు రోడ్‌షో నిర్వహించారు. దాదాపు ఏడు డివిజన్లలో పర్యటించారు. పలు సామాజిక వర్గాల సమావేశాల్లో పాల్గొన్నారు. ప్రత్యేక వ్యూహం రచించి డివిజనుకు ఇద్దరేసి మంత్రులను.. పది పోలింగ్ కేంద్రాలకు ఒక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీని.. ప్రతి వంద మంది ఓటర్లకు ఒక నేతను ఇన్‌ఛార్జిగా నియమించారు. నియోజకవర్గంలో దాదాపు రూ.300 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని.. సంక్షేమ పథకాలను అమలు చేశామని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. సీఎం తన ప్రచారంలో భారాస, భాజపా లక్ష్యంగా ఆరోపణలు గుప్పించారు. మూడు పర్యాయాలు మాగంటి గోపీనాథ్ గెలిచినా నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని ప్రచారం చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భారాసతో భాజపా మిలాఖత్ అయిందని ఆరోపించారు.

**భారాస... బాకీ కార్డుల ప్రచారం**

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదంటూ ఆ పార్టీ బాకీ కార్డుల ప్రచారం భారాస విస్తృతంగా చేసింది. దివంగత మాగంటి గోపీనాథ్ భార్య సునీత పోటీ చేస్తుండడంతో సెంటిమెంట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లింది. కేటీఆర్ అన్నీ తానై వ్యూహాలు రూపొందించారు.

# కుప్పం దశ మార్చే ప్రాజెక్టులు...
## ఒకేరోజు 7 పరిశ్రమలకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తూ, ఒకే రోజు ఏకంగా ఏడు భారీ పరిశ్రమలకు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. రూ.2,203 కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చే ఈ పరిశ్రమల కోసం 241 ఎకరాల స్థలం కేటాయించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 22,330 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఒకప్పుడు అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న కుప్పాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు కానున్న ఈ ఏడు సంస్థల్లో దేశంలోని దిగ్గజ కంపెనీలు ఉన్నాయి. ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన హిండాల్కో సంస్థ రూ.586 కోట్లతో మొబైల్, ల్యాప్‌టాప్ వంటి టెక్ పరికరాల విడిభాగాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. శ్రీజా డైరీ రూ.290 కోట్లతో సమీకృత డెయిరీ, పశువుల మేత ప్లాంటును, ఏస్ ఇంటర్నేషనల్ సంస్థ రూ.525 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ డెయిరీ ఉత్పత్తుల కాంప్లెక్స్‌ను, ఎస్వీఎఫ్ సోయా రూ.373 కోట్లతో వంట నూనెల తయారీ యూనిట్‌ను స్థాపించనున్నాయి. వీటితో పాటు మదర్ డైరీ రూ.260 కోట్లతో పండ్ల రసాల యూనిట్‌ను, ఇరాయిస్ ఈవీ రూ.200 కోట్లతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రాన్ని, అలీప్ సంస్థ రూ.27 కోట్లతో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పార్కును అభివృద్ధి చేయనుంది.

*** కుప్పం దశ మార్చే ప్రణాళిక**

ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నామని, భవిష్యత్తులో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఏరో స్పేస్ సిటీలను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు కూడలిగా ఉన్న కుప్పం భౌగోళిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు.

*** రైతులకు, మహిళలకు పెద్దపీట**

ఈ పరిశ్రమల రాకతో కేవలం యువతకు ఉద్యోగాలే కాకుండా, స్థానిక రైతులు, మహిళలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరనుంది. శ్రీజా డెయిరీ రోజుకు నాలుగు లక్షల లీటర్ల పాలను, మదర్ డైరీ పండ్లను, ఎస్వీఎఫ్ సోయా స్థానిక పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తాయని, దీనివల్ల పాడి, వ్యవసాయ రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని సీఎం తెలిపారు. ప్రత్యేకంగా మహిళల కోసం అలీప్ సంస్థ నిర్మిస్తున్న 'మహిళా శక్తి భవన్' ద్వారా 4,000 మందికి ఉపాధి, శిక్షణ లభిస్తాయని చెప్పారు. ఈ ఏడాదిలో డ్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "వన్ ఫ్యామిలీవన్ ఎంటర్‌ప్రెన్యూర్, వన్ ఫ్యామిలీవన్ ఏఐ నిపుణుడు అనే పాలసీలతో చరిత్రను తిరగరాస్తాం" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

*** త్వరలో మరో 8 కంపెనీలు**

ఈ ఏడు కంపెనీలే కాకుండా త్వరలోనే రూ.6,339 కోట్ల పెట్టుబడితో మరో 8 సంస్థలు కుప్పానికి రానున్నాయని, వాటి ద్వారా అదనంగా 43 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని చంద్రబాబు శుభవార్త చెప్పారు. దీంతో బ్యాటరీ టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, ఫుడ్ లాజిస్టిక్స్ వంటి రంగాల్లో కుప్పం కీలక కేంద్రంగా మారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కరవును దూరం చేసేందుకు 700 కిలోమీటర్ల దూరం నుంచి హంద్రీనీవా జలాలను కుప్పానికి తీసుకొచ్చామని, దీంతో తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీటి కొరత ఉండదని హామీ ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ, సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు.

## కుప్పంలో హిండాల్కో రూ. 586 కోట్ల పెట్టుబడి... మా వేగమే నిదర్శనం

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. ప్రపంచ ప్రఖ్యాత ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన మెటల్స్ దిగ్గజం హిండాల్కో ఇండస్ట్రీస్, చిత్తూరు జిల్లా కుప్పంలో రూ. 586 కోట్ల భారీ పెట్టుబడితో అత్యాధునిక అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాల్లోని స్పష్టత, పనుల అమలులో వేగమే ఈ పెట్టుబడికి కారణమని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఏపీకి వస్తున్న ప్రధాన పెట్టుబడుల గురించి వివరిస్తూ లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. "ఆదిత్య బిర్లా గ్రూప్ నుంచి గ్లోబల్ మెటల్స్ లీడర్ అయిన హిండాల్కోకు ఆంధ్రప్రదేశ్ గర్వంగా స్వాగతం పలుకుతోంది. కుప్పంలో రూ. 586 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 613 మందికి, పరోక్షంగా మరెందరికో ఉపాధి లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ యూనిట్‌లో ఐఫోన్ ఛాసిస్ (బాడీ) కోసం అవసరమైన అత్యున్నత నాణ్యత కలిగిన అల్యూమినియంను తయారు చేస్తారని, తద్వారా యాపిల్ గ్లోబల్ సప్లై చైన్‌లో ఆంధ్రప్రదేశ్ ఒక ముఖ్యమైన భాగంగా మారుతుందని లోకేశ్ వివరించారు. 2027 మార్చి నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2025 30 ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ విజయానికి హిండాల్కో పెట్టుబడే నిదర్శనమని లోకేశ్ అన్నారు. "హిండాల్కో ఏపీని ఎంచుకోవడానికి ప్రధాన కారణాలు మా ముందుచూపుతో కూడిన విధానాలు, బెంగళూరుకు 120 కిలోమీటర్లు, చెన్నైకి 200 కిలోమీటర్ల దూరంలో కుప్పం వ్యూహాత్మకంగా ఉండటం, పునరుత్పాదక ఇంధన వనరులు అందుబాటులో ఉండటం" అని ఆయన పేర్కొన్నారు. ఈ పెట్టుబడితో కుప్పం ప్రాంతం స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ తయారీకి నమ్మకమైన ప్రత్యామ్నాయ కేంద్రంగా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

*** మాకు ప్రజలు ముఖ్యం.. అందుకే ఏపీని ఎంచుకున్నాం: హిండాల్కో ఎండీ**

ఈ సందర్భంగా హిండాల్కో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ సతీశ్ పాయ్ మాట్లాడిన ఒక వీడియోను కూడా లోకేశ్ తన పోస్ట్‌కు జతచేశారు. ఏపీని ఎంచుకోవడానికి గల కారణాలను పాయ్ అందులో వివరించారు. "దక్షిణ భారతదేశంలోని ఎలక్ట్రానిక్ హబ్‌కు సమీపంలో కుప్పం వ్యూహాత్మకంగా ఉంది. ఇక్కడ లాజిస్టిక్స్, నైపుణ్యం గల కార్మికులు, స్థానిక, రాష్ట్ర పరిపాలన నుంచి లభిస్తున్న మద్దతు మా నిర్ణయంలో కీలక పాత్ర పోషించాయి" అని అన్నారు. ముఖ్యంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (స్టేట్ పీఎల్ఐ స్కీమ్) తమ పెట్టుబడి నిర్ణయంలో అత్యంత కీలకమైన అంశమని ఆయన నొక్కిచెప్పారు. పునరుత్పాదక ఇంధనం, జీరో వేస్ట్ విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం తమ పర్యావరణ లక్ష్యాలకు సరిగ్గా సరిపోయిందని అన్నారు. "మాకు ప్రజలు ముఖ్యం. పరిశ్రమలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం, పనుల అమలులో వారి వేగం ఎంతో మార్పును తెస్తున్నాయి. అందుకే ఈ రోజు ఏపీ పారిశ్రామిక పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారింది" అని సతీశ్ పాయ్ ప్రశంసించారు. త్వరలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు 2025కు ముందు ఈ ప్రకటన రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన పారిశ్రామిక విధానాలను, అవకాశాలను ప్రదర్శించనుంది. హిండాల్కో ప్లాంట్ ఏర్పాటుతో కుప్పం ప్రాంతంలో అనుబంధ పరిశ్రమలు, స్థానిక సరఫరాదారులకు అవకాశాలు పెరగడంతో పాటు, నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి మార్గాలు విస్తృతం కానున్నాయి.

### రేవంత్ రెడ్డి నన్ను తిట్టినప్పుడు
## కేసీఆర్ ఫోన్ చేసి ఆ మాట చెప్పారు: కేటీఆర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను దూషించినప్పుడు, తమ పార్టీ అధినేత కేసీఆర్ ఫోన్ చేసి, నువ్వు టెంప్ట్ కావొద్దని సూచించారు, దీంతో తాను ఏమీ అనలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. టీవీ9 ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇటీవల జరిగిన ఒక సభలో రేవంత్ రెడ్డి తనను తీవ్రంగా దూషించారని, అది చూసిన కేసీఆర్ వెంటనే ఫోన్ చేసి మాట్లాడారని కేటీఆర్ చెప్పారు. రేవంత్ రెడ్డి తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో నిరాశలో ఉన్నందువల్ల అలా మాట్లాడుతున్నారని కేసీఆర్ తనకు చెప్పారని ఆయన అన్నారు. అందుకే, తాను కూడా అదే స్థాయిలో ప్రతిస్పందించవద్దని కేసీఆర్ సూచించారని కేటీఆర్ తెలిపారు. సంయమనంతో వ్యవహరించాలని కేసీఆర్ సలహా ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి తనను దూషించినందుకు మరుసటి రోజు తాను కూడా ఘాటుగా



మాట్లాడాలనుకున్నానని, కానీ కేసీఆర్ సూచనతో సంయమనం పాటించానని కేటీఆర్ అన్నారు. ఇలాంటి విషయాల్లో అన్ని పార్టీల అధ్యక్షులు తమ పార్టీ నేతలను నియంత్రించాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తనను కేసీఆర్ నియంత్రించినట్లుగానే, కాంగ్రెస్ పార్టీలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, బీజేపీలో రామచంద్ర రావు తమ పార్టీ నేతలను నియంత్రించాలని ఆయన అన్నారు. ఇలాంటి ధోరణుల వల్ల ప్రజలు రాజకీయ నాయకులను అసహ్యించుకునే పరిస్థితి వస్తుందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంచి సంప్రదాయానికి తమ పార్టీ తరఫున పునాది వేస్తామని ఆయన అన్నారు. తనను విమర్శిస్తే సహిస్తానని, కానీ కేసీఆర్‌ను విమర్శిస్తే మాత్రం ఊరుకునేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

*** రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆయన ఐదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్నాను. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి తర్వాతైనా తెలంగాణలో మంచి పాలన అందించాలని ఆశిస్తున్నాను. ఆయన నిండు నూరేళ్ల ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ కౌన్సిల్ సభ్యుడిగా యేదిరే రమేష్

* **జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



అందోలు, ప్రజాస్ఫూర్తి: క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ కౌన్సిల్ సభ్యుడిగా యేదిరే రమేష్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని ప్రైవేట్ ఆసు పత్రులు, క్లినిక్, డయాగ్నస్టిక్ సెంటర్లపై నియంత్రణ కోసం ప్రభుత్వం నూతన 'క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ కౌన్సిల్ ను ఏర్పాటు చేసింది. గత కౌన్సిల్ పదవీకాలం ఈ ఏడాది జూన్లో ముగియడంతో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ యాక్ట్ 2010 ప్రకారం ఈ కౌన్సిల్ ను పునర్ వ్యవస్థీకరిస్తూ వైద్యారోగ్య శాఖ తాజాగా జీవో నెం. 173 జారీ చేసింది. ఈ కౌన్సిల్ సభ్యులు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. కౌన్సి ల్ కు హెల్త్ సెక్రటరీ ఎక్స్అఫీషియో చైర్ పర్సన్ లుగా వ్యవహరిస్తుండగా, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ), పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ (డీహెచ్) మెంబర్ సెక్రటరీలుగా ఉంటారు. వైస్ చైర్మన్ గా డాక్టర్ గుండ గాని శ్రీనివాస్ ను అధికారులు నియమించారు. సభ్యులుగా నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్, రాష్ట్ర మెడికల్, డెంటల్, నర్సింగ్, ఫార్మసీ కౌన్సిళ్ల ప్రతినిధులు, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ దయాళ్ సింగ్ , అడ్వకేట్ కె.గౌరీశంకర్ రావు, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్కు చెందిన ముక్తాబా హసన్ అస్కారీతో సహా పలువురికి చోటు కల్పించారు. రాష్ట్రంలోని క్లినికల్ సంస్థల రిజిస్ట్రేషన్, వాటి పనితీరును పర్యవేక్షించడం, నిబంధనలు సరిగ్గా అమలయ్యేలా చూడటం వంటి బాధ్యత లను ఈ కౌన్సిల్ నిర్వర్తిస్తుంది.

**వైద్య మంత్రికి కృతజ్ఞతలు..**

క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించినందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి. దామోదర రాజా నరసింహ కు కృతజ్ఞతలు తెలియజేశారు. కౌన్సిల్ సభ్యుడిగా నా బాధ్యతలను సక్రమంగా నిర్వహించి కౌన్సిల్ కు మంచి పేరు వచ్చేలా కృషి చేస్తాను. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన మంత్రి దామోదర్ కు రుణపడి ఉంటాను.

## డ్రైనేజీ పనులను పరిశీలించిన కాంటేస్టెడ్ కార్పొరేటర్ నేమూరీ మహేష్ గౌడ్



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురం కాలనీ లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రూ.3 లక్షల 50 వేల నిధులతో మంజూరు చేసిన డ్రైనేజీ పనులు మొదలు కావడం జరిగింది.ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు కాంటేస్టెడ్ కార్పొరేటర్ నేమూరీ మహేష్ గౌడ్ కాలనీ అధ్యక్షులు పండు ముదిరాజ్ తో కలిసి పనులను పర్యవేక్షించడం జరిగింది.ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషితో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం కావడం సంతోషకరం అని కాలనీ వాసులు అన్నారు.ఈ కార్యక్రమంలో రాఘవ రెడ్డి, అశోక్ ,జగన్మోహన్ రెడ్, సహదేవ గౌడ్, భాస్కర్ రెడ్డి, యాకయ్య సంతోష్ గుప్తా, నాగరాజు గుప్తా, వెంకటేష్ గుప్తా ,తన్నీరు వెంకటేశం ,ఆర్ రాజు కాలని వాసులు పాల్గొన్నారు.



## డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేలా కృషి చేస్తా

* **అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగం పల్లి , (ప్రజాస్ఫూర్తి) : డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేలా కృషి చేస్తానని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగూడ ఇంద్రనగర్ కాలనీలో కొంతమేర నూతన డ్రైనేజీ లైన్ నిర్మించాలని కాలనీ వాసులు సమస్యను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ శనివారం కాలనీ లో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సుమారు 70 మీటర్లు పొడవు ఉండే డ్రైనేజీ లైన్ కొరకు ఎస్టిమేషన్ వేసి, నిధులు మంజూరు చేయాలనీ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి తెలియచేసారు. వీలైనంత త్వరలో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, జోగిపేట భాస్కర్, బాల రాజు, రవీందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజా స్ఫూర్తి ఇల్లందు: తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఇల్లందు టౌన్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో శాసనసభ్యులు కోరం కనకయ్య ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల్లో* పాల్గొని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు.ఈ కార్యక్రమంలో ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపీపీ మండల రాంమహేష్ గారు ఇల్లందు టౌన్ మండల పార్టీ అధ్యక్షులు దొడ్డ డేనియల్,పులి సైదులు,నాయకులు పూనెం సురేందర్,కాకటిభార్గవ్,తాటి భిక్షం,అరెంకిరణ్ మాజీ సర్పంచులు కల్తీ పద్మ,పాయం లలిత యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఈసం లక్ష్మణ్,బండి ఆనంద్, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎం డి జాఫర్ జాఫర్,హరి హర క్షేత్రం చైర్మన్ గందె సదానందం,టౌన్ కార్యనిర్వాహక అధ్యక్షులు సుదర్శన్ కోరి,మాజీ కౌన్సిలర్లు కుక్క నాగేశ్వరరావు కమల్ కోరి, మేకల శ్యామ్, పడితల నవీన్,టౌన్ మహిళా పార్టీ అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప,మడుగు వెంకటలక్ష్మి,మేదరి భుక్యా వీరన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు...



అందోలు, ప్రజాస్ఫూర్తి : సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో బర్త్ డే వేడుకలను ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి లాంగ్ లైవ్ రేవంత్ రెడ్డి అంటూ నినాదాలు చేశారు. జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.. ప్రజలకు మరింత సుభిక్షంగా పాలన అందించేందుకు, రాబోయే కాలంలో కూడా ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్నిఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు రేవంత్ రెడ్డికి మరింత శక్తిని భగవంతుడు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తెనుగు మహిపాల్, మొరబోయిన కృష్ణ, అందులపల్లి రమేష్ గౌడ్, చిలుకంటి వీరేశం,రామన్న గారి నర్సింలు, బాల్ రాజ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ బలోపేతానికి ఆర్థికంగా సహకరించాలి

* **జనకళ్యాణ్ దివాస్ ప్రారంభం**
* **తగరం సుభాష్ చంద్రబోస్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బీఎస్పీ పార్టీ బలోపేతానికి ఆర్థికంగా సహకారం అందించాలని బీఎస్పీ మునుగోడు నియోజకవర్గం అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ కోరారు. మునుగోడు నియోజకవర్గంలో జనకళ్యాణ్ దివాస్ కార్యక్రమాన్ని చౌటుప్పల్ మండలం మల్కాపూర్ గ్రామంలో శనివారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలను ఏమైనా ఉన్నాయా అని తెలుసుకొని, బహుజన ఉద్యోగుల వద్ద విరాళాలను సేకరించారు. అదేవిధంగా గ్రామస్తుల నుంచి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా తగరం సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ జనకళ్యాణ్ దివాస్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. గ్రామంలోని ప్రజలు పార్టీ బలోపేదానికి తన వంతుగా కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. 2026, జనవరి 15వ తేదీ వరకు జనకళ్యాణ్ దివాస్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జి కత్తుల పరమేష్,నియోజకవర్గం కోశాధికారి మాధ రమేష్, చౌటుప్పల్ మున్సిపల్ నాయకులు గడ్డమీది బాబు,రాజు గౌడ్, లింగస్వామి, కోలుకుల పల్లి వెంకటేష్ బహుజన్ సమాజ్ పార్టీ గ్రామ స్థాయి నాయకులు నరసింహ, తరుణ్, సాయితేజ, కోలుకులపల్లి రవితేజ, రమేష్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## మసాన్ పల్లిలో పెద్దమ్మ తల్లి దేవాలయం ముస్తాబు...

* **ఈ నెల 10న ఆలయ ప్రథమ వార్షికోత్సవం...**

అందోలు, ప్రజాస్ఫూర్తి:అందోలు మండలం పరిధిలోని మాసాన్ పల్లి గ్రామం లో శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం ప్రథమ



వార్షికోత్సవాలకు ముస్తాబైంది. ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 10 న జరుగనున్నాయి. వార్షికోత్సవాల సందర్భంగా శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయన్ని ముస్తాబు చేస్తున్నారు. వార్షికోత్సవాలు రంగంపేట పిఠాధిపతి శ్రీ శ్రీ మాధవనంద సరస్వతి స్వామి అనుగ్రహంతో జరుగనున్నట్లు ఆలయ ఛైర్మెన్ పి. నారాయణ తెలిపారు. ఈ నెల 10వ తేదిన సోమవారం ఉ॥ 800 గం॥లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ వాస్తు, బ్రహ్మాది మండల పూజ, అవాహిత మండప హెూమం, అభిషేకం, పూర్ణాహుతి, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, మధ్యాహ్నం 1 గంటలకు సామూహిక బోనాల ఊరేగింపు వంటి విశేష పూజ కార్యక్రమాలు పెద్దమ్మ తల్లికి నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇట్టి వార్షికోత్సవ వేడుకల్లో ప్రముఖులతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని వార్షికోత్సవనికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వార్షకోత్సవ వేడుకల్లో పాల్గొనే భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భక్తులు అందరు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ఫర్నీచర్ ప్రొడక్షన్ శిక్షణకు 11 మంది ఎంపిక

**: కలెక్టర్ జితేష్ వి.పాటిల్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:రాజమండ్రిలో మూడు నెలలపాటు నిర్వహించనున్న రెసిడెన్షిల్ మల్టీపర్పస్ అసిస్టెంట్, ఫర్నీచర్ ప్రొడక్షన్, ఇన్‌స్టాలేషన్ కోర్సుకు 11 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ లో ఒరియెంటేషన్, ఎంపిక పరీక్ష ద్వారా వీరిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత ఈ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యంతో ముందుకు సాగాలని సూచించారు. శిక్షణ పొందనున్న వారికి రూ.5 వేల రిజిస్ట్రేషన్ ఫీజును జిల్లా యంత్రాంగం భరిస్తుందని, వసతి, భోజనం పూర్తిగా ఉచితంగా కల్పించబడుతుందన్నారు. శిక్షణ పూర్తయ్యిన తర్వాత రూ. 15 వేల వేతనంతో 6 నెలల అప్రెంటిస్‌షిప్ అవకాశం ఉంటుందని, అనంతరం 100% ప్లేస్‌మెంట్ అవకాశాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకయ్య, సైదేశ్, ఈడియం, దిలీప్, నందు, ర్యాంపు కోఆర్డినేటర్స్, జేఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



## భద్రాద్రి టీవీవీపీ ఆసుపత్రులు భేష్

* **ఏజెన్సీ ప్రాంతంలో సేవలు అద్భుతం**
* **సిఆర్ఎం జాతీయ బృందం కితాబు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో సైతం స్పెషలిస్ట్ వైద్య సేవలు అద్భుతంగా అందుతున్నాయని, మంచి ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని సిఆర్ఎం (కామన్ రివ్యూ మిషన్) బృంద సభ్యులు డాక్టర్ జి.బి.సింగ్ కొనియాడారు. ఇటీవల జిల్లాలో వైద్య సేవలు, ప్రమాణాలు పరిశీలించడానికి వచ్చిన రాష్ట్ర స్థాయి బృంద సభ్యులు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇల్లందు, భద్రాచలం ఆసుపత్రుల సేవలపై ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు జిల్లా అధికారులు తెలిపారు. అన్ని స్థాయిలలో సిబ్బంది ఎంతో శ్రద్ధ, అంకిత భావంతో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆసుపత్రులలో అన్ని వార్డులను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు చాలా మంది రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారన్నారు. వైద్య సేవలపై అందరూ చాలా సంతృప్తిగా ఉన్నారని, ఆసుపత్రులలో వార్డులు, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్‌లు చాలా బాగా నిర్వహిస్తున్నారని, సానిటేషన్ కూడా బాగుందని కితాబిచ్చినట్లు తెలిపారు. డయలిసిస్ సేవలు కూడా చాలా బాగున్నాయని, అన్ని సెంటర్స్‌లో అన్ని బెడ్స్ నిండి ఉన్నాయనే విషయాన్ని గమనించామని పేర్కొన్నారన్నారు. ఇల్లందు ఆసుపత్రిలో భవన స్థలం తక్కువ ఉన్నప్పటికీ సేవలు స్థాయికి మించి చేస్తున్నారని తెలిపారన్నారు. మారుమూల ప్రాంతాల్లో సైతం రేడియాలజిస్ట్, మత్తు వైద్యులు, ఇతర స్పెషలిస్ట్ వైద్యులు సరిపడా స్థాయిలో ఉండడం, టిఫా స్కాన్ సేవలు సైతం ఉండడం విశేషం అని నివేదికలో పేర్కొన్నట్లు అధికారులు చెప్పారు. భద్రాచలం ఆసుపత్రి జిల్లాకే గర్వకారణం అని, 200 పడకలతో ఐసీయూ, ఎస్ఎన్‌సియు, ఎన్ఆర్‌సి, ఆపరేషన్ థియేటర్ సేవలు అద్భుతంగా, ఆదర్శంగా ఉన్నాయన్నాని ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. తీవ్ర స్థాయిలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వాటిని అధిగమించి అక్కడ ఉన్న సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని కితాబిచ్చారన్నారు. సిబ్బంది కొరత తీరితే మరింత సేవలను అందించే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడినట్లు తెలిపారు. అన్ని స్థాయిలలో ఆసుపత్రిలో ప్రమాణాల విషయం లో నిరంతరంగా శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఆర్ఎం సభ్యులతో పాటు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్ సంగీత సత్యనారాయణ, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ కుమార్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, భద్రాద్రి జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు, డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా

## మొక్కలు నాటిన ప్రకృతి ప్రేమికులు కె.ఎన్. రాజశేఖర్, నైనిక రజువా



ప్రజా స్ఫూర్తి , భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కొత్తగూడెం పట్టణం రామవరం బ్రిడ్జి వద్దనున్న శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ప్రకృతి ప్రేమికుడు, హరిత దీక్ష వ్యవస్థాపకుడు, మన్‌కీబాత్ కె.ఎన్.రాజశేఖర్, సెయింట్ మేరీస్ హై స్కూల్ విద్యార్థిని, ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటి ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు. రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజున కూడా మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలియజేసినట్లు రాజశేఖర్ గుర్తుచేశారు.

## మెగా జాబ్ మేళా'ను సద్వినియోగం చేసుకోండి

*** కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో ఈనెల 16వ తేదీన సింగరేణి సంస్థ సౌజన్యంతో మెగా జాబ్‌మేళా నిర్వహించబోతున్నామని, ఈ జాబ్‌మేళాను కొత్తగూడెం నియోజకవర్గంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు శనివారం అయన విలేకరులతో మాట్లాడుతూ తొలుత 65 కంపెనీలు జాబ్ మేళా శిభిరంలో పాల్గొనేందుకు ఆహ్వానించామని, మరిన్ని కంపెనీలు శిభిరంలో పాల్గొనేవిధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. 5 వేల మందికి ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో శిభిరాన్ని నిర్వహించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన క్యూఆర్ స్కానర్‌ను సోషల్ మీడియామాధ్యమాలు, కరపత్రాలు, వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు, హోర్డింగులు ద్వారా అందుబాటులోకి తెచ్చామని, నేరుగా ఈ స్కానర్ ద్వారా నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకొని 16న జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. నేరుగా శిభిరంలో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఒక్కో అభ్యర్థి ఐదు సంస్థలకు సంబంధించి ఇంటర్వ్యూలలో పాల్గొనవచ్చని చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆహ్వానించామని, జిల్లా ఉన్నతాధికారులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. సింగరేణి అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి పెద్ద సంఖ్యలో నిరోద్యోగులు శిభిరంలో పాల్గొనే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

## అమెరికాలో.. కారంచేడు విద్యార్థిని మృతి

కారంచేడు: ఉన్నత విద్యనభ్యసించి కుటుంబాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో ఎన్నో ఆశలతో అమెరికాలో అడుగుపెట్టిన ఆ విద్యార్థిని ఆశలు అడియాశలయ్యాయి. చదువు పూర్తి చేసుకుని.. కొద్దిరోజుల్లో కొలువులో చేరుతుందని ఆశగా ఉన్న ఆ కుటుంబ ఆశల దీపాన్ని విధి వెక్కిరించింది. అనారోగ్యం రూపంలో ఆమెను బలిగొంది. వివరాల్లోకి వెళితే.. బాపట్ల జిల్లా కారంచేడుకు చెందిన యార్లగడ్డ రామకృష్ణ, నాగమణి దంపతుల కుమార్తె రాజ్యలక్ష్మి (23) విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం అమెరికాలోని ఓ యూనివర్సిటీలో ఎంఎస్ కంప్యూటర్స్ విభాగంలో 2023లో చేరింది. ఇటీవల విద్యాభ్యాసం కూడా ముగియడంతో అక్కడే స్నేహితులతో కలిసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. మూడు రోజుల క్రితం జలుబు, ఆయాసంగా ఉందని.. చికిత్స కోసం ఈనెల 9కి వైద్యుల అపాయింట్‌మెంట్ తీసుకున్నానని గురువారం రాత్రి కుటుంబ సభ్యులకు తెలిపింది. అదే రోజు రాత్రి స్నేహితులతో కలిసి నిద్రపోయింది. రాజ్యలక్ష్మిని ఉదయం స్నేహితులు నిద్రలేపేందుకు ప్రయత్నించగా.. ఎలాంటి స్పందన లేదు. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.

## బంజారా సంఘాల జేఏసీ జిల్లా నూతన కమిటీ నియామకం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:బంజారా సంఘాల జేఏసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీని జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్, వైస్ చైర్మన్ బానోతు వీరు నాయక్‌ల ఆధ్వర్యంలో నియమించారు. జిల్లా బంజారా సంఘాల జేఏసీ సమావేశం శుక్రవారం రాత్రి చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్ అధ్యక్షతన విద్యానగర్ కాలనీలో జరిగింది. ఈ సమావేశంలో వివిధ కుల, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ శంకర్ నాయక్ మాట్లాడుతూ బంజారా కులంలోని వివిధ సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలలో జిల్లా బాధ్యులుగా వ్యవహరిస్తున్న వారిని జిల్లా జేఏసీ కార్యవర్గ బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో త్వరలోనే నియోజకవర్గ, మండల, గ్రామ పంచాయతీల స్థాయిలో బంజారా సంఘాల జేఏసీ కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బంజారాల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని జాతరను ఘనంగా నిర్వహించేందుకు బంజారా సోదరులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బంజారాల ఆరైద్య దైవం తుల్జా భవాని జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర నలుమూలల నుండి బంజారాలు భారీగా తరలివచ్చే విధంగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్ తరాలకు బంజారా సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవడం కోసం ప్రతి బంజారా బిడ్డలు తమ వంతు కృషి చేయాలని, భవిష్యత్ తరాలకు బంజారా సాంప్రదాయాలను అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు భూక్య రమేష్ రాథోడ్, బానోతు రాములు, ధరావత్ లక్ష్మణ, అజ్మీర శంకర్, ప్రధాన కార్యదర్శులు బానోత్ బాలు నాయక్, భూక్య చందు నాయక్, ధరావత్ కాన్షిరాం, గుగులోత్ కేశవ, మూడ్ జయరాం చౌహాన్, ధారావత్ బాలాజీ, ధరమ్‌సోత్ ఉపేందర్, లీగల్ అడ్వైజర్‌లు గుగులోత్ అనిల్, తేజావత్ యోగి, ధరావత్ రాధాకృష్ణ, మాలోత్ ప్రసాద్, ట్రెజరర్‌లు భానోత్ రమేష్, బానోత్ రవికుమార్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

*** అధ్యక్షులుగా కొల్లు నాగేశ్వరారవు తిరిగి ఎంపిక**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:తెలంగాణ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ నందుగల అసోసియేషన్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొల్లు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బి.శివరామకృష్ణ, కార్యదర్శిగా ఎస్.సురేష్ కుమార్, జాయింట్ సెక్రటరీగా ఎన్.కామేశ్వర రావు, ట్రెజరర్‌గా దండముడి ధర్మారావులను అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పి. మాధవరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, 2025-28కి గాను నూతన కమిటీ ఎన్నుకోబడింది. ఈ సందర్భంగా అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతీ యేటా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్వహించే పలు కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యమవుతున్నామని తెలిపారు. జిల్లా అధికారులు కూడా తమ అసోసియేషన్‌కు సహాయ సహకారాలు అందిస్తున్నారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలోనూ తమ సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు పోటు రాఘవరావు, ఫస్ట్ ఎయిడ్ డాక్టర్ రమణ చారి, కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఉడుముల తిరుపతి రెడ్డి, ఖాసిం, రిటైర్డ్ హెడ్మాస్టర్ కేశిరెడ్డి, రిటైర్డ్ టీచర్ చింతలపూడి వెంకటేశ్వర్లు, సభ్యులు సామ్యూల్, సీతారామ శాస్త్రి, పాండురంగారావు, మైనేని నాగేశ్వరరావు, గురుమూర్తి, కొండ రాములు, తోట సమ్మయ్య, రషీద్, డి. సొందు బాబు, వి.శ్రీనివాసరావు, అంజనానందం, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్, జి.విజయ మోహన్, బి.కేశవరావు, అక్కినేని మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో 'బాలోత్సవ్'.. ఆకట్టుకున్న జానపద నృత్య ప్రదర్శనలు

గుంటూరు (సాంస్కృతికం): ప్రపంచ బాలల పండుగ పేరిట వీవీఐటీయూ ఆధ్వర్యంలో రెండో రోజు 'బాలోత్సవ్' కార్యక్రమం కొనసాగింది. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయి. రెండో రోజు చిన్నారుల జానపద నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డిజిటల్ చిత్ర లేఖనం, సంగీతం, కథారచన, శాస్త్రీయ నృత్యం, సైన్సు ఆవిష్కరణలు, లఘు నాటికలు, జానపద గీతాలు, ఏకపాత్రాభినయం, స్పెల్ బీ, తెలుగు పద్యం, తెలుగులోనే మాట్లాడుదాం, కవితా రచన, లేఖా రచన తదితర విభాగాల్లో చిన్నారులు పాల్గొని ఆకట్టుకున్నారు.




## హైనెక్ ఉండగా... నగలెందుకిక!

**సోషల్‌మీడియా, వార్తలు... ఆఖరికి మీమ్స్‌లోనూ ఒకటే చర్చ... బంగారం గురించే. దాని ధరేమో రోజురోజుకీ కొండెక్కి కూర్చుంటోంది. దానిపై మనసు పడేదీ, నగల్ని కోరి చేయించుకునే అమ్మాయిలకు ఇది కష్టమే. ఎన్ని ఉన్నా మరొకటి కావాలనే కోరుకుంటారు. వేడుకలేవైనా వస్తే దుస్తులతోపాటు ఏం నగలు కొనాలన్న చర్చ తప్పనిసరి. ఇలా బంగారం ధర పెరుగుతూపోతే ఇక ఎలా కొంటాం? పోనీలే ఉన్నది చాలు. వాటినే పెట్టుకుందామంటే పదే పదే పెట్టాలంటే మనకీ బోరే. అందుకే అమ్మాయిలు ఒక మార్గం కనిపెట్టేశారు... అదే హై నెక్ బ్లవుజులు. ఇవి ఇప్పటివా? ఎప్పట్నుంచో ఉన్నవేగా అంటారా! నిజమే. ఒకప్పుడు ఫ్యాషన్ ప్రపంచాన్ని ఏలినవే. తాజాగా అమ్మాయిల మనసును మళ్లీ దోచేస్తున్నాయి. అయితే స్టైలిష్ లుక్‌తోపాటు రాజసాన్నీ తెచ్చిపెడతాయన్న కారణాన్ని కాదు వాళ్లు చెబుతోంది. చక్కగా మెడను కప్పేస్తాయన్న సమాధానమిస్తున్నారు. అలాగని సాదా చీరలకే ఇలా చేస్తున్నారని అనుకునేరు. పార్టీవేర్ నుంచి పట్టు వరకు అన్నింటికీ ఇదే ఫ్యాషన్ జోడిస్తున్నారు. మరీ సాదాగా ఉంటుందేమో అనిపిస్తే అద్దాలు, రాళ్లు, సీక్విన్లు, త్రెడ్ వర్క్, లేసులతో మెడ, చేతులను తీర్చిదిద్దేస్తున్నారిలా. అచ్చం స్టేట్‌మెంట్ పీస్‌ల్లా అనిపించట్లేదూ? పైగా అందానికి అందం, స్టైలిష్ లుక్ అదనం. కాబట్టే... హైనెక్ ఉండగా నగలతో పనేముందిక అంటూ తాము డిజైన్ చేయించుకున్న బ్లవుజులతో సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు. వైరల్ చేస్తున్నారు కూడా. వీటిని చూడగానే అరె... భలేగుందే ఆలోచన అని మీకూ అనిపిస్తోందా? ఇంకేం... ఏ చీర కట్టుకోవాలి? దానికి ఏ నగలు బాగుంటాయన్న కంగారుని పక్కన పెట్టి హైనెక్ బ్లవుజులతో చక్కగా సిద్ధమై పోవచ్చు. కాబట్టి మీరూ మీకు నచ్చిన చీరకి హైనెక్ బ్లవుజులుని జోడించేయండి. దీనిలోనూ బోలెడు రకాలు. ఏది అనువైనదో పరిశీలించుకుని ఎంచుకుంటే సరిపోతుంది... ప్రయత్నించేయండి మరి!**





## ఇమ్యూనిటీ పెరగాలంటే..!

**రోగనిరోధక శక్తి.. మనల్ని వివిధ రకాల వ్యాధులు, అనారోగ్యాల బారి నుంచి కాపాడే బలమైన వ్యవస్థ ఇది. ఇది పటిష్టంగా ఉంటే వైరస్, బ్యాక్టీరియాలు మన ఆరోగ్యంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపలేవు. అయితే రోగనిరోధక శక్తి దృఢంగా ఉండాలంటే మనం తీసుకునే ఆహారమూ ముఖ్యమే! అందులోనూ కొన్ని విటమిన్లుండే ఆహార పదార్థాల్ని రోజూ తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..**

### విటమిన్ 'సి'

మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడే విటమిన్లలో విటమిన్ 'సి'ది కీలక పాత్ర. ఈ విటమిన్ లోపం ఉన్న వాళ్లు త్వరగా జబ్బు పడే అవకాశాలుంటాయి. అందుకే మనం రోజూ తీసుకునే ఆహారంలో విటమిన్ 'సి' పుష్కలంగా లభించే కమలాఫలం, నిమ్మకాయ.. వంటి నిమ్మజాతి పండ్లను భాగం చేసుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. అలాగే పాలకూర, క్యాప్సికం.. వంటివి కూడా మెనూలో చేర్చుకోవాలి.




### విటమిన్ 'బి6'

రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో విటమిన్ 'బి6' సహకరిస్తుంది. కాబట్టి ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే విటమిన్ 'బి6' అధికంగా లభించే అరటిపండ్లు, బంగాళాదుంపలు, చికెన్, చేపలు, శెనగలు.. వంటి ఆహార పదార్థాల్ని రోజువారీ మెనూలో భాగం చేసుకోవాలి.

### విటమిన్ 'ఇ'

విటమిన్ 'ఇ' మన శరీరంలో ఒక శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది బ్యాక్టీరియా, వైరస్, ఇతర ఇన్ఫెక్షన్లతో సమర్థంగా పోరాడి.. అవి మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపకుండా కాపాడుతుంది. అలాగే ఈ విటమిన్ రోగనిరోధక వ్యవస్థను పటిష్ట పరచడంలోనూ సహకరిస్తుంది. కాబట్టి ఇది ఎక్కువగా లభించే పొద్దుతిరుగుడు గింజలు, పల్లీలు, బాదంపప్పులు, పాలకూర, నట్స్.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి.

### విటమిన్ 'ఎ'

ఈ విటమిన్‌లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. అలాగే విటమిన్ 'ఎ' కంటి ఆరోగ్యానికి కూడా మంచిది. కాబట్టి క్యారట్స్, తర్బూజా, గుమ్మడికాయ, సొరకాయ.. వంటి విటమిన్ 'ఎ' ఎక్కువగా లభించే ఆహార పదార్థాల్ని తీసుకోవడం ఉత్తమం.

### విటమిన్ 'డి'

విటమిన్ 'డి'లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, ఇమ్యునోరెగ్యులేటరీ గుణాలు రోగనిరోధక వ్యవస్థ చురుగ్గా పనిచేయడానికి, దాని రక్షణకు తోడ్పడతాయి. కాబట్టి ఈ విటమిన్‌ను పొందడానికి ఉదయాన్నే లేలేత ఎండలో ఓ అరగంట పాటు గడపాలి. అలాగే ఇది అధికంగా లభించే చేపలు, పాలు, పప్పులు.. వంటివి ఎక్కువగా తీసుకోవాలి. విటమిన్ 'డి' వల్ల ఎముకలు కూడా దృఢంగా మారతాయి.



# స్వతంత్ర సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోంది: మీనాక్షి నటరాజన్

హైదరాబాద్: స్వతంత్ర సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో జనాభిప్రాయం ప్రకారం ఫలితం రాలేదన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఓట్ల చోరీపై ఇటీవల రాహుల్ గాంధీ మీడియాకు వివరాలు వెల్లడించారని, కొన్ని ప్రాంతాల్లో ఒకే చిరునామాతో ఎక్కువ ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. హరియాణాలో 8 సీట్లలో 400 ఓట్ల వ్యత్యాసంతో కాంగ్రెస్ ఓడిపోయిందని చెప్పారు. ఓట్ల చోరీపై సంతకాల సేకరణ కొనసాగుతోందని తెలిపారు.

*** ఈసీని గుప్పెట్లో పెట్టుకొని అవకతవకలు: మహేశ్‌కుమార్ గౌడ్**

ఎన్నికల సంఘాన్ని భాజపా ప్రభావితం చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఈసీని గుప్పిట్లో ఉంచుకొని ఓట్ల అవకతవకలకు భాజపా పాల్పడుతోందన్నారు. దీనిని రాహుల్ గాంధీ ఇప్పటికే ఆధారాలతో సహా నిరూపించారన్నారు. హరియాణాలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ప్రజలంతా భావించారని, అందుకు వ్యతిరేకంగా భాజపా గెలిచిందని అన్నారు. "హరియాణాలో 25 లక్షల నకిలీ ఓట్లు ఉన్నాయి. ఒకే మహిళ ఫొటోతో వంద ఓట్లు ఉన్నాయి. పక్క రాష్ట్రాల్లోని వ్యక్తులను సైతం ఓటర్లుగా చేర్చారు. బిహార్‌లో తమకు బలం లేని చోట.. ఓట్లను భాజపా తొలగిస్తోంది. ఈసీని ఆధారాలతో సహా రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే.. సమాధానం లేదు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఈసీ.. ఒకే పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోంది. ఓట్ల అవకతవకలకు వ్యతిరేకంగా సంతకాలు సేకరిస్తున్నాం. ఇప్పటి వరకు దేశంలో 5 కోట్ల సంతకాల సేకరణ జరిగింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనూ పక్క నియోజకవర్గాల ఓటర్లను చేర్చారు" అని విమర్శించారు.





## మూసాపేటలో 'థ్యాంక్స్ టు హైడ్రా' పేరిట ప్రదర్శన

హైదరాబాద్: నగరంలోని మూసాపేట వై జంక్షన్‌లో హైడ్రాకు మద్దతుగా స్థానికులు ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఆంజనేయ నగర్‌లోని వివాదాస్పద పార్క్ స్థలాన్ని హైడ్రా రక్షించింది. అందుకు హైడ్రాకు ధన్యవాదాలు చెబుతూ.. 'థ్యాంక్స్ టు హైడ్రా' పేరుతో ప్రదర్శన నిర్వహించారు.

## ప్రజల దృష్టి మళ్లించేందుకే రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం

**: కిషన్ రెడ్డి**

హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడరని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. హామీల అమలులో సీఎం రేవంత్ వైఫల్యం చెందారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ప్రజల దృష్టి మళ్లించేందుకు నాపై, భాజపాపై రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భారత రాష్ట్ర సమితి, భాజపా కలిసిపోయాయని తప్పుడు ప్రచారం చేశారు. గతంలోనూ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇలానే చేశారు. నాపై వ్యక్తిగత విమర్శలకు దిగినా.. నేను భయపడను. తెలంగాణ అభివృద్ధి విషయంలో రేవంత్ సర్టిఫికెట్ నాకు అవసరం లేదు. ఈ రాష్ట్ర అభివృద్ధికి భాజపా ఏం చేసిందో ప్రజలకు తెలుసు. ఆ రెండు పార్టీల మాదిరి భాజపా అవినీతి, కుటుంబ పార్టీ కాదు. ఇచ్చిన హామీలు అమలు చేయడమే భాజపాకు తెలుసు. మా పాలనపై చిన్న అవినీతి ఆరోపణ కూడా రాలేదు. ఫేక్ వీడియోలతో మా పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ అభివృద్ధిపై నా వివరణ వినే ధైర్యం కేసీఆర్, రేవంత్‌రెడ్డికి ఉందా? కాంగ్రెస్ హైకమాండ్‌కు భయపడి రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవడం లేదు. సీఎం రేవంత్ రెడ్డిది ఫెయిల్యూర్ ప్రభుత్వం" అని కిషన్ రెడ్డి మండిపడ్డారు.



## పలు విమానాశ్రయాల్లో సాంకేతిక సమస్యలు.. రామ్మోహన్‌నాయుడు సమీక్ష

దిల్లీ: దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తలెత్తిన సాంకేతిక సమస్యలపై పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టి సారించారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకూ ఆయన విమానాశ్రయంలోనే గడిపారు. నిన్న బెంగళూరు విమానాశ్రయంలో కార్యక్రమం పూర్తి చేసుకుని సాయంత్రం మంత్రి దిల్లీకి వచ్చారు. నిన్న సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఏటీసీలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాజాగా హైదరాబాద్ విమానాశ్రయంతో పాటు పలు చోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఇవాళ ఉదయం నుంచే అధికారులతో రామ్మోహన్‌నాయుడు సమీక్ష చేపట్టారు. సాంకేతిక సమస్యలు అధిగమించేందుకు అన్ని అంశాలపై ఎయిర్ పోర్టు అథారిటీ, డీజీసీఏ, విమానాశ్రయ అధికారులతో చర్చిస్తున్నారు. దిల్లీ సహా పలు చోట్ల సమస్యలు తలెత్తి విమానాలు ఆలస్యం అవుతుండటంతో రామ్మోహన్ నాయుడు మాల్దీవుల పర్యటన రద్దు చేసుకున్నారు.



## సీఎం రేవంత్‌రెడ్డి మాటల్లో

### కాంగ్రెస్ ఓటమి భయం కనిపిస్తోందని: ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మాటల్లో కాంగ్రెస్ ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. ఫ్రస్టేషన్‌లో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. భాజపాపై నిందలు వేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యాల నుంచి తప్పించుకునేందుకు భాజపాపై నిందలు వేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటికొక ఉద్యోగం అంటూ.. మీ మిత్రుడు బిహార్‌లో హామీ ఇచ్చారు. 7 కోట్ల మంది ఉన్న బిహార్‌లో ఇంటికొక ఉద్యోగం సాధ్యమేనా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రజలకు మీరిచ్చే గిఫ్ట్ ఏంటో చెప్పాలన్నారు. గతంలో కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి చెట్టాపట్టాలు వేసుకొని అధికారాన్ని పంచుకున్నారని ఆరోపించారు. 20 శాతం ఓట్ల కోసం ఇంకా దిగజారి మాట్లాడితే 80 శాతం ఉన్న ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం అని హెచ్చరించారు. పాముకు పాలు పోసి పెంచినట్టు.. పాతబస్తీలో ఎంఐఎంకు అవకాశం ఇస్తే ఈరోజు విష నాగుల మాదిరిగా పరిస్థితి తయారైంది అని ఆందోళన వ్యక్తంచేశారు.



## ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారు

### బీఆర్ఎస్ నేతలపై శ్రీధర్ బాబు ఫైర్

తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే తమ ప్రభుత్వ అజెండా అని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీఆర్ఎస్, బీజేపీ తమపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా శనివారం శ్రీనగర్ కాలనీ, ఎల్లారెడ్డి గూడలోని పలు కాలనీల్లో శ్రీధర్‌బాబు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ పాలనలో దొర్లిన తప్పులను సరిదిద్దేందుకు తీసుకున్న చర్యలను ఓటర్లకు వివరించారు. మేం వేసే ప్రతి అడుగు భావితరాల భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి కోసమేనని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని, ఒక్కసారి విజ్ఞతతో ఆలోచించాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురయ్యిందన్నారు. చాలా కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఇప్పుడు ఆ పార్టీ నాయకులు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారో నిలదీయాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటూ... స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న నవీన్ యాదవ్‌ను ఇక్కడ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.





## స్త్రీ శక్తి హస్తకళ స్టోర్‌ను ప్రారంభించిన నారా భువనేశ్వరి

హైదరాబాద్: ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ మెయిన్‌గేట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి హస్తకళ స్టోర్‌ను ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రారంభించారు. 600 మందికి పైగా స్త్రీ శక్తి విమెన్ అసోసియేషన్ సభ్యులు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. వారి ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం హైదరాబాద్‌లో తొలి స్త్రీ శక్తి హస్తకళ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టోర్‌లో వస్త్రాలు, గాజులు, చెవి పోగులు, హ్యాండ్ బ్యాగ్స్ విక్రయానికి సిద్ధంగా ఉంచారు.

## హైడ్రాకు అండగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు

### : హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్

హైడ్రాకు మద్దతు పలికిన నగర ప్రజలకు హైడ్రా కృతజ్ఞతలు తెలిపింది. సామాజిక మాధ్యమాలు వేదికగా.. వేల ఇళ్లను హైడ్రా కూల్చిందంటూ కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని ర్యాలీలు, ప్రదర్శనల ద్వారా తిప్పి కొట్టిన వారికి హైడ్రా ధన్యవాదాలు తెలిపింది. ప్రజల నుంచి వచ్చిన మద్దతు హైడ్రాకు మరింత స్ఫూర్తినిచ్చింది అని హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని.. పర్యావరణ హితమైన నగరంలో ప్రజలు మెరుగైన జీవనాన్ని కొనసాగించాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు హైడ్రా పని చేస్తోందని స్పష్టం చేశారు. హైడ్రా వల్ల జరిగిన మేలును వివరిస్తూ.. పెద్దలు, పిల్లలు, మహిళలు, యువకులు ర్యాలీలు నిర్వహించి హైడ్రాకు మద్దతు తెలపడంపట్ల హైడ్రా హర్షం వ్యక్తం చేసింది. హైడ్రా వల్ల లక్షల మందికి లాభం చేకూరిందంటూ.. నగరవ్యాప్తంగా జరిగిన మేలును వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించిన తీరు మాలో స్ఫూర్తిని నింపిందన్నారు. మీడియా సంస్థలతో పాటు.. చాలా వరకు సామాజిక మాధ్యమాలు కూడా హైడ్రా కార్యక్రమాలను ప్రజలవద్దకు చేరవేసిన తీరును అభినందిస్తున్నామన్నారు.

*** చట్టాలను గౌరవిస్తూనే ముందుకు....**

చట్టంలో ఉన్న అక్షరాల వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం, ఆంతర్యం, లక్ష్యం తెలుసుకుని హైడ్రా పని చేస్తోందని కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. రాజ్యాంగం, న్యాయస్థానాలు, చట్టాలపైన హైడ్రాకు ఎనలేని గౌరవం ఉందని.. వాటి స్ఫూర్తితోనే ప్రకృతి పరిరక్షణకు పాటుపడుతున్నామన్నారు. పేదవారిని అడ్డం పెట్టుకొని బడాబాబులు సాగిస్తున్న కబ్జాలను వెలికి తీస్తుందన్నారు. ధనదాహంతో ఇష్టానుసారం కబ్జాలు చేసి ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్నవారు హైడ్రాపై దాదాపు 700ల వరకూ కేసులు పెట్టారని.. వ్యక్తిగతంగా తనపై కూడా 31 వరకూ కంటెంప్ట్ కేసులు వేశారని గుర్తు చేశారు. చట్టాలను గౌరవిస్తూ.. ప్రజలు ఇచ్చిన స్ఫూర్తితో పర్యావరణాన్ని, ప్రజల ఆస్తులను పరిరక్షిస్తామన్నారు. ప్రభుత్వం దిశానిర్దేశం చేసిన విధంగా చెరువులు, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కాపాడుతూ ప్రకృతిని పరిరక్షించేందుకు పని చేస్తున్నామన్నారు. 2024 జూలైకి ముందు నుంచే నివాసం ఉన్నవారి ఇళ్ల జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేశారు. తప్పనిసరి అయి తొలగించాల్సివస్తే వారికి ప్రత్యామ్నాయం, పరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదిస్తామని హైడ్రా కమిషనర్ తెలిపారు.





## అభివృద్ధి కావాలంటే అధికార పార్టీ అభ్యర్థి గెలవాలి..

### మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. అధికార పార్టీ అభ్యర్థి గెలిస్తేనే ప్రాంతంలో అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆమె పేర్కొన్నారు. 'అన్ని మతాలకు సమాన గౌరవం ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ. సామాన్యులకు సంక్షేమ ఫలాలు అందించే పార్టీ ఇది. అర్హులందరికీ రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నాం. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 4 వేల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తున్నాం' అని సీతక్క వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మౌలిక వసతుల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని తెలిపారు. గత 10 ఏళ్లుగా బీఆర్ఎస్ ఈ నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు ఒకసారి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు అవకాశం ఇవ్వండని ప్రజలను కోరారు.

# మా హయాంలో 88 వేలమంది చొరబాటుదారులను తిప్పిపంపాం: దిగ్విజయ్



అక్రమ వలసదారులను ప్రతిపక్షాలు కాపాడుతున్నాయంటూ భాజపా ఆరోపిస్తోంది. బిహార్ ఎన్నికల వేళ దీన్ని ప్రచారాస్త్రంగా వినియోగిస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీఏ పదేళ్ల పాలనలో 88 వేలమంది చొరబాటుదారులను వెనక్కి పంపినట్లు వెల్లడించారు. కానీ, గత 11 ఏళ్లలో ఎన్డీయే సర్కారు కేవలం 2,400 మందిని మాత్రమే గుర్తించినట్లు విమర్శించారు. "బిహార్ ఎన్నికల్లో చొరబాటుదారుల అంశాన్ని భాజపా పదేపదే లేవనెత్తుతోంది. కానీ, వాస్తవం ఏంటంటే.. యూపీఏ తన పదేళ్ల పాలనలో 88 వేలమంది అక్రమ వలసదారులను తిప్పిపంపింది. కానీ, భాజపా మాత్రం 11 ఏళ్లలో కేవలం 2,400 మంది చొరబాటుదారులను మాత్రమే గుర్తించింది. యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు గుర్తించిన సంఖ్యలో ఇది మూడు శాతం కూడా లేదు. అయినప్పటికీ.. భాజపా ఎల్లప్పుడూ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తోంది" అని దిగ్విజయ్ విమర్శించారు. "గతంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండేలా ఎన్నికల సంఘం చూసుకునేది. కానీ, ఇప్పుడు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కింద పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యతను ప్రజలపైకి నెట్టేసింది. ఒకవేళ ఎవరైనా తమ పౌరసత్వాన్ని నిరూపించుకోలేకపోతే దాని పర్యవసానం ఏంటి?" అని ప్రశ్నించారు. 2003లో జనన ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, స్కూల్ సర్టిఫికేట్ల వంటివి సరిపోయాయని, ఇప్పుడు 99 శాతం భారతీయుల వద్ద లేని పత్రాలను డిమాండ్ చేస్తున్నారని విమర్శించారు. "ఓటర్ల జాబితాల్లో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. అభ్యర్థులకు ఇచ్చే ఓటర్ లిస్ట్, పోలింగ్ రోజున ప్రిసైడింగ్ అధికారుల వద్ద ఉండే జాబితాలు భిన్నంగా ఉంటున్నాయి. దీనివల్ల అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతున్నారు. ఎన్నికలు ప్రకటించిన వెంటనే ఓటర్ల జాబితాను స్తంభింపజేయాలి. తద్వారా ఓటర్లను చేర్చడం, తొలగించడం వంటివి అడ్డుకోవచ్చు" అని దిగ్విజయ్ సింగ్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ సహా ఆయా రాష్ట్రాల్లో ఇటీవల 'ఎస్ఐఆర్' ప్రక్రియ ప్రారంభమైన వేళ ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## పాక్ అణుకేంద్రాలపై దాడికి నాడు ఇందిర అంగీకరించలేదు..!



అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ మాజీ అధికారి రిచర్డ్ బార్లో కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌లోని కహుతా న్యూక్లియర్ సెంటర్‌పై కోవర్ట్ ఆపరేషన్‌కు నాటి ప్రధాని ఇందిరాగాంధీ అంగీకరించి ఉంటే ఎన్నో సమస్యలు పరిష్కారం అయ్యేవని పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వం దానిని తిరస్కరించడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. కొన్ని నివేదికలు, బహిరంగపరిచిన కథనాల ప్రకారం.. పాకిస్థాన్‌లోని కహుతా న్యూక్లియర్ ప్లాంట్‌పై వైమానిక దాడులు నిర్వహించేందుకు ఇండియా, ఇజ్రాయెల్ ప్రణాళికలు వేసినట్లు తెలుస్తోంది. ఆ దేశం అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా, వాటిని ఇతర దేశాలకు అందించకుండా చూసేందుకు ఈ దాడి చేయాలని ప్రతిపాదనలు చేసుకున్నాయి. పాకిస్థాన్ నుంచి తన బద్ధశత్రువైన ఇరాన్‌కు అవి అందకుండా చేయాలన్నది ఇజ్రాయెల్ లక్ష్యం. అయితే ఆ కోవర్ట్ ఆపరేషన్‌కు నాటి ప్రధాని ఇందిరాగాంధీ అంగీకారం తెలపలేదని అవి పేర్కొన్నాయి. 1982 నుంచి 1985 మధ్యలో ప్రభుత్వ సేవలకు దూరంగా ఉన్న రిచర్డ్ బార్లో ఈ ప్రణాళిక గురించి కేవలం విన్నానని చెప్పారు. అప్పటి ప్రభుత్వం దానిని అంగీకరించి ఉంటే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభించేదని చెప్పారు. అలాగే అప్పుడు అమెరికాలో అధికారంలో ఉన్న రోనాల్డ్ రీగన్ కూడా దీనిని బలంగా తిరస్కరించేవారేమోనని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఎందుకంటే ఆ సమయంలో అఫ్గానిస్థాన్‌లో సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా అమెరికా కోవర్ట్ ఆపరేషన్ ప్రయత్నాల్లో ఉంది. వాటికి అంతరాయం కలగొచ్చనే ఉద్దేశంతో ఇజ్రాయెల్ ప్రయత్నాలను అమెరికా తిరస్కరించి ఉండేదని చెప్పారు. అమెరికా ఇలా ఆధారపడటాన్ని పాక్ ఒక అవకాశంగా భావించింది. పాక్ అటామిక్ ఎనర్జీ కమిషన్ అప్పటి హెడ్ మునీర్ అహ్మద్ ఖాన్.. యూఎస్‌ను బెదిరించే ప్రయత్నం చేశారు. అమెరికా నుంచి అందే సహాయంలో ఏవైనా అంతరాయాలు కలిగితే.. అఫ్గాన్ విషయంలో ఇచ్చే సహకారం దెబ్బతినొచ్చని వ్యాఖ్యలు చేసినట్లు బార్లో వెల్లడించారు. పాకిస్థాన్ అణు పితామహుడు ఏక్యూఖాన్ ఆధ్వర్యంలో కహుతా న్యూక్లియర్ సెంటర్ ఏర్పాటైంది. 1998లో తొలి అణుపరీక్ష నిర్వహించింది.

## ఆ ఎంపీ రెండు వేళ్లకూ 'సిరా' గుర్తు.. అసలేం జరిగింది?



బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్డీయే మిత్రపక్షం లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్)కి చెందిన ఎంపీ శాంభవి చౌధరీ వివాదంలో చిక్కుకున్నారు. ఆమె రెండు చేతుల చూపుడువేళ్లకు సిరా గుర్తు ఉండటమే అందుకు కారణం. దానికి సంబంధించిన దృశ్యాలు వైరల్ కావడంతో పట్నా జిల్లా యంత్రాంగం స్పందించింది. ఇంతకీ ఏం జరిగిందంటే..? బిహార్లో ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి . తొలిదశ పోలింగ్ నవంబర్ ఆరున పూర్తయింది. దానిలో భాగంగా ఎంపీ శాంభవి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటేసిన తర్వాత తన కుటుంబంతో కలిసి మీడియా ఎదుటకు వచ్చారు. అప్పుడు కుడి చేతికి ఉన్న సిరా గుర్తును చూపించారు. తండ్రి సంజ్ఞ చేయడంతో తర్వాత ఎడమ చేతికి ఉన్న సిరా గుర్తును చూపించారు. ఇలా రెండువేళ్లకు ఇంక్ ఉండటం వివాదాస్పదమైంది. ఆమె రెండుసార్లు ఓటేశారంటూ విమర్శలు వ్యక్తమయ్యాయి. "ఇదొక వేరేస్థాయి మోసం. ఇలా ఎలా జరుగుతుంది..? దీనిపై ఎవరు దర్యాప్తు జరుపుతారు..?" అని ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి ఆర్జేడీ పార్టీ ప్రశ్నించింది. ఇది మానవ తప్పిదం, దీన్నొక వివాదం చేయకండని ఆమె స్పందించారు. ఈ దృశ్యాలు వైరల్ కావడంతో పట్నా జిల్లా యంత్రాంగం వివరణ ఇచ్చింది. "ఇది పోలింగ్ సిబ్బంది కారణంగా జరిగిన తప్పిదం. సిబ్బందిలో ఒకరు కుడిచేతి చూపుడు వేలికి ఇంక్ వేశారని విచారణలో భాగంగా గుర్తించాం. తర్వాత ప్రిసైడింగ్ ఆఫీసర్ జోక్యంతో ఎడమ చేతి వేలికి సిరా గుర్తు వేశారు" అని వెల్లడించింది. అలాగే ఆమె ఓటు వేసిన కేంద్రం, ఆమె సీరియల్ నంబర్ వివరాలను షేర్ చేసింది. గురువారం జరిగిన తొలిదశలో పోలింగ్ శాతం 65.08 శాతంగా నమోదైంది. మొత్తం 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో ఓటింగ్ జరిగింది. బిహార్ లో మొత్తం 243 శాసనసభ స్థానాలు ఉన్నాయి. నవంబర్ 11న రెండో విడత పోలింగ్ జరగనుంది. 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## అవును.. లాలూ తరహాలో కుంభకోణాలు చేయలేరు: అమిత్ షా



కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌లు 'సీమాంచల్'ను చొరబాటుదారుల అడ్డాగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారని కేంద్ర మంత్రి అమిత్ షా ఆరోపించారు. పూర్ణియాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ.. ప్రతి అక్రమ వలసదారుడిని గుర్తించి దేశం నుంచి బహిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా తేజస్వీ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు బదులిస్తూ.. ఏడు జన్మలెత్తినా లాలూ మాదిరిగా మోదీ కుంభకోణాలు చేయలేరని చురకలంటించారు. "బిహార్‌లో 160 స్థానాల్లో విజయం సాధించి ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే సగం రాష్ట్రం కాంగ్రెస్ ఆర్జేడీ కూటమికి తలుపులు మూసివేసింది. రాహుల్, తేజస్వీలు కలిసి సీమాంచల్ ప్రాంతాన్ని చొరబాటుదారుల అడ్డాగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారు. ప్రతి చొరబాటుదారుడిని గుర్తించి, ఎన్నికల జాబితా నుంచి వారి పేర్లను తొలగిస్తాం. వారి దేశానికి పంపిస్తాం" అని అమిత్ షా పేర్కొన్నారు. రైల్వేలో లాలూ ప్రసాద్ యాదవ్ తీసుకొచ్చిన లాభాలను ప్రధాని మోదీ ఏడు జన్మలెత్తినా తీసుకురాలేరంటూ ఇటీవల తేజస్వీ యాదవ్ చేసిన విమర్శలకు గట్టిగా బదులిచ్చారు. ఏడు జన్మలెత్తినా లాలూ మాదిరిగా మోదీ కుంభకోణాలు చేయలేరంటూ ధ్వజమెత్తారు.

**'ఓటు చోరీ' ఆరోపణలు నిరాధారం..**

రాష్ట్రంలో ఓట్ల చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న వ్యాఖ్యలు నిరాధారమైనవని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. వాటికి సంబంధించి ఏమైనా ఆధారాలు ఉంటే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని సూచించారు. రోహ్‌తాస్‌లో ఎన్నికల ప్రచార సభలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ పార్టీ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, అందుకే ఆ పార్టీ నేత అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కులం, మతం పేరుతో కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. సాయుధ బలగాలను రాజకీయాల్లోకి లాగొద్దని ఈ సందర్భంగా రాహుల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.



## ఆపరేషన్ పింపుల్.. ఇద్దరు ఉగ్రవాదుల హతం

జమ్మూకశ్మీర్‌లోని కుప్వాడా జిల్లాలో భద్రతా బలగాలు ఆపరేషన్ పింపుల్‌ను నిర్వహిస్తున్నాయి. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారం అందుకున్న బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ విషయాన్ని శనివారం భారత సైన్యానికి చెందిన చినార్ కోర్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. "ఉగ్రవాదులు చొరబాటుకు యత్నిస్తున్నారన్న నిఘా సమాచారం ఆధారంగా నవంబర్ 7న కుప్వాడాలో ఆపరేషన్ పింపుల్ చేపట్టాం. ఈ క్రమంలో ఉగ్ర మూకలు విచక్షణారహితంగా కాల్పులకు పాల్పడ్డారు" అని వెల్లడించింది. సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని పేర్కొంది. ఈ వారంలో భద్రతా బలగాలు ఆపరేషన్ ఛత్రు ను చేపట్టిన సంగతి తెలిసిందే. కిష్తివాడ్ జిల్లాలో ముగ్గురు ఉగ్రవాదులు దాక్కున్నట్లు సమాచారం అందడంతో ఈ ఆపరేషన్ చేపట్టారు.

## భల్లూకాలతో భయం భయం.. రంగంలోకి సైన్యం!



జపాన్‌లోని అకిటా రాష్ట్రంలో ఇటీవల ఎలుగుబంట్ల దాడులు విపరీతంగా పెరగడంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. గడిచిన ఆరు నెలల్లోనే వందకు పైగా దాడులు చోటుచేసుకోగా.. పలువురు ప్రాణాలు కోల్పోవడం కలవరపాటుకు గురిచేస్తోంది. స్థానిక యంత్రాంగం కూడా చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన జపాన్ ప్రభుత్వం.. సైనిక బృందాలను రంగంలోకి దించింది. జపాన్‌లోని కజనో పట్టణంలో ఎలుగుబంట్ల సంచారం ఇటీవల విపరీతంగా పెరిగింది. ఆహారం వేటలో జనావాస ప్రాంతాల్లోకి వస్తూ దాడులు చేస్తున్నాయి. రైల్వే స్టేషన్లు, రిసార్టులు, సూపర్ మార్కెట్లతోపాటు పాఠశాలల్లోనూ నిత్యం తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది వీటి సంచారం ఆరు రెట్లు పెరిగినట్లు అంచనా. ఏప్రిల్ నుంచి ఇవి చేసిన దాడుల్లో 13 మంది చనిపోగా.. 100 మందికిపైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

## మునిగిపోయేందుకు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ : రాహుల్ చేపలవేటపై మోదీ సెటైర్





బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార, విపక్ష పార్టీలు పదునైన వ్యాఖ్యలతో విమర్శలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల చేపలవేట కోసం మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగారు. దానిని ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. బిహార్ చేపలను చూడటానికి పెద్దపెద్దవాళ్లు వస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో మునిగిపోయేందుకు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. కొన్నిరోజుల క్రితం బెగుసరాయ్ జిల్లాలో మత్స్యకారులతో కలిసి రాహుల్ చేపలు పట్టేందుకు వెళ్లారు. అప్పుడు ఆయన వెంట మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు, విపక్ష కూటమి డిప్యూటీ సీఎం అభ్యర్థి ముకేశ్ సాహ్నీ కూడా ఉన్నారు. చేపలు పట్టేందుకుగానూ సాహ్నీ నీళ్లలోకి దిగి వలవేశారు. కాసేపటికి రాహుల్ గాంధీ సైతం నీళ్లలో దూకారు. మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. ఈత కొట్టారు. ఆ సందర్భంగా జాలర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వేట నిషేధిత కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం, బీమా సదుపాయం, చేపల మార్కెట్‌ల ఏర్పాటు, మత్స్య సంపద కోసం జలవనరుల పునరుద్ధరణ వంటి హామీలు ఇచ్చారని కాంగ్రెస్ వెల్లడించింది.

*** ఓట్లు లాగేందుకు రూ.10వేల లంచం: ప్రియాంక**

రూ.10వేలు ఇచ్చి, ఓట్లు కొల్లగొట్టొచ్చని భాజపా భావిస్తోందని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకా గాంధీ విమర్శించారు. కతిహార్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడారు. "ఒకప్పుడు మహాత్మాగాంధీ చేసిన పోరాటమే కాంగ్రెస్ చేస్తోంది. ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలు అన్నింటిని తన ఇద్దరు కార్పొరేట్ స్నేహితులకే అప్పగిస్తున్నారు. ఆయన కట్టా (నాటు తుపాకీ) వంటి పదాలను ఉపయోగించి, ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు" అంటూ దుయ్యబట్టారు. ఎన్నికల వేళ బిహార్ ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజనను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లోకి డబ్బు జమ చేయడం దాని ఉద్దేశం. మహిళా సాధికారత, స్వయం ఉపాధి కల్పించే దిశగా రూ.7,500 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించారు.

## రూ.200కోట్ల విలువైన భూమి రూ.3 కోట్లకే: మహారాష్ట్రలో మరో భూకుంభకోణం!



మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ భూ కుంభకోణం కేసు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరో భూ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ రూ.200 కోట్ల విలువైన భూమిని.. రూ.3 కోట్లకే దక్కించుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు విజయ్ వడెట్టివార్ విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతాప్ సర్‌నాయక్ మీరా భయందర్‌లో దాదాపు రూ.200 కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమిని రూ.3 కోట్లకు కొనుగోలు చేశారని ఆరోపించారు. అక్కడ ఆయన ఓ విద్యాసంస్థను ఏర్పాటు చేశారన్నారు. ఈ ఆరోపణలపై మహారాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ బవాంకులే స్పందించారు. దీని గురించి తాను కూడా విన్నానని.. కానీ, దీనిపై ఇప్పటివరకు ఎవరినుంచి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ప్రతిపక్షాలు తమకు ఫిర్యాదు చేయడం కాకుండా.. మీడియా ముందుకొచ్చి ఆరోపణలు చేసేందుకు సమయం కేటాయిస్తున్నారన్నారు. దీనికి సంబంధించి ఏదైనా ఫిర్యాదు అందితే తాము తప్పక చర్యలు తీసుకుంటామన్నారు.

# హైదరాబాద్‌లో పెరుగుతున్న హౌసింగ్ ఇన్వెంటరీ

ముంబై తర్వాత అత్యధిక ఇన్వెంటరీ మన దగ్గరే..

నగరంలో విక్రయానికి సుమారు లక్ష ఇళ్లు రెడీ

వీటిల్లో సగానికి పైగా పశ్చిమ హైదరాబాద్‌లోనే..

ఎఫ్ఎస్ఐ, అధిక సరఫరా, ప్రభుత్వ ప్రతికూల విధానాలు వంటి కారణాలనేకం

నాలాలు, చెరువుల సమీపంలో ఇల్లు కొనేందుకు జంకుతున్న కస్టమర్లు



**హైదరాబాద్:** 'ఆదిభట్లలో ఓ నిర్మాణ సంస్థ రెండేళ్ల క్రితం భారీ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టను ప్రారంభించింది. ఇప్పటి వరకు వంద అపార్ట్‌మెంట్లను కూడా విక్రయించలేకపోయింది. దీంతో నిర్మాణ పనులను మధ్యలోనే ఆపేసి, ఆఫీసును తాత్కాలికంగా మూసివేశారు. ఉద్యోగుల జీతభత్యాలు, నిర్వహణ ఖర్చులను కూడా భరించలేని పరిస్థితి ఏర్పడటంతో ప్రస్తుతం బిల్డర్ కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్నాడు.' ..ఒకరిద్దరు కాదు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో చాలా మంది పరిస్థితి ఇదే. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం, ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ)పై ఆంక్షలు లేకపోవడం, అపరిమిత సరఫరా, వడ్డీ రేట్లు, అధిక ధరలు, ప్రభుత్వ ప్రతికూల విధానాలు వంటి రకరకాల కారణాలతో అపార్ట్‌మెంట్ల విక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. దీంతో నగరంలో ఇన్వెంటరీ పెరిగిపోయింది. కస్టమర్ల వాకిన్స్ లేకపోవడంతో అపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి.

నిర్దిష్ట కాలంలో మార్కెట్‌లో అమ్ముడుపోకుండా ఉన్న ఇళ్లు లేదా అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లను ఇన్వెంటరీగా పరిగణిస్తుంటారు. ప్రస్తుతం దేశంలోని ఏడు ప్రధాన మెట్రో నగరాలలో ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 5,61,756 ఇన్వెంటరీ యూనిట్లున్నాయి. ఇందులో అత్యధికంగా ముంబైలో 1.76 లక్షల యూనిట్లుండగా.. రెండో స్థానంలో హైదరాబాద్ నిలిచింది. ప్రస్తుతం నగరంలో 95,331 ఇన్వెంటరీ యూనిట్లున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో ఏకంగా లక్షకుపైగా ఇన్వెంటరీ ఉండగా.. ప్రస్తుతం కొంతమేర తగ్గాయి. అయితే దక్షిణాది నగరాలతో పోలిస్తే మన దగ్గరే ఇన్వెంటరీ అత్యధికంగా ఉంది. బెంగళూరులో 59,244, చెన్నైలో 32,379 ఇన్వెంటరీ యూనిట్లున్నాయి.

దేశంలో భవనాల ఎత్తుపై ఆంక్షలు లేని ఏకైక నగరం హైదరాబాదే. ఇక్కడ ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ)పై ఆంక్షలు లేకపోవడంతో డెవలపర్లు పోటీపడుతూ హైరైజ్ ప్రాజెక్టులను చేపడుతున్నారు. ఎకరం, రెండెకరాల స్థలంలోనే రెండు వేలు, మూడు వేల అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నారు. దీంతో ప్రతికూల సమయంలో విక్రయాలు లేక అపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉంటున్నాయి. నగరంలో సగానికి పైగా ఇన్వెంటరీ పశ్చిమ హైదరాబాద్‌లోనే ఉంది. మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట, నార్సింగి, మణికొండ వంటి ప్రాంతాలలో డిమాండ్‌కు మించి అపార్ట్‌మెంట్ల సరఫరా రావడమే ఇందుకు ప్రధాన కారణం. నాలాలు, చెరువులకు సమీపంలో ప్రాజెక్టుల పేరు వింటేనే కస్టమర్లు జంకుతున్నారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ వంటి ప్రభుత్వ విభాగాల నుంచి నిర్మాణ అనుమతులు ఉన్నా సరే లేక్ వ్యూ ప్రాజెక్టులలో కొనుగోళ్లకు వెనకడుగేస్తున్నారు. ఎందుకంటే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంటూ ఏ కారణంతో ఎప్పుడు కూలుస్తారో? అక్రమ నిర్మాణం అంటారోనని గృహ కొనుగోలుదారులు వెనుకడుగేస్తున్నారు. తక్కువ ధరకు వస్తుందనో, ఆహ్లాదకర వాతావరణం ఉంటుందనో ధైర్యం చేసి అపార్ట్‌మెంట్ కొని, బ్యాంక్ ఈఎంఐ భారం భరించడం కంటే లేక్ వ్యూలకు దూరంగా ఉండటమే ఉత్తమమనే అభిప్రాయం కస్టమర్లలో నెలకొంది. దీంతో గతంలో లేక్‌వ్యూ అంటే ఎగబడి కొన్న జనం.. నేడు విక్రయాలు లేక ప్రాజెక్టులు విలవిల్లాడుతున్నాయి.

స్థిరాస్తి రంగంలో సగానికి పైగా కొనుగోళ్లు ఐటీ సెక్టార్ నుంచే జరుగుతుంటాయి. కృత్రిమ మేధస్సు(ఏఐ) శరవేగంగా దూసుకొస్తుండటంతో ఐటీ విభాగంలో లే ఆఫ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో ప్రాపర్టీ విక్రయాలు మందగించాయి. ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందో తెలియని అయోమయంలో ఐటీ ఉద్యోగులు అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నారు. రూ.2%-%3 కోట్ల ధర ఉన్న లగ్జరీ ప్రాజెక్టులలో ఇన్వెంటరీ ఎక్కువగా ఉంది. విలాసవంతమైన ఇళ్ల కొనుగోళ్లకు కస్టమర్లు వేచి చూసే ధోరణిలో ఉండటంతో ఈ విభాగంలో ఇన్వెంటరీ పెరిగింది. కరోనా తర్వాత నుంచి విలాసవంతమైన ఇళ్లకు డిమాండ్ పెరగడంతో బిల్డర్లు కూడా లగ్జరీ ప్రాజెక్టులను ఇబ్బడిముబ్బడిగా ప్రారంభించారు. ఇది కూడా ఇన్వెంటరీ పెరిగేందుకు కారణమే. పెరిగిన భూముల ధరల నేపథ్యంలో రూ.60 లక్షల లోపు ధర ఉండే మధ్య తరగతి ఇళ్లను నిర్మించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పరిమిత సరఫరా కారణంగా ఈ విభాగంలో ఇన్వెంటరీ ఎక్కువగా లేదు. లగ్జరీ సెగ్మెంట్‌లో డెవలపర్లు పోటీపడి మరీ ప్రాజెక్టులను చేపట్టడంతో ప్రస్తుతం విక్రయాలు లేక అపార్ట్‌మెంట్లు ఖాళీగా కనిపిస్తున్నాయి.

## బ్యాంకుల్లో ఎన్నిసార్లు నగదు విత్ డ్రా చేసుకోవచ్చు..!

పరిమితి దాటితే చార్జీ ఎంత?




**న్యూఢిల్లీ:** ప్రస్తుత సాంకేతిక యుగంలో డిజిటల్ చెల్లింపులో జోరుగా సాగుతున్నాయి. టీ దుకాణాల నుంచి బడా షాపింగ్ మాల్స్ వరకు యూపీఐ పేమెంట్స్ జరుగుతున్నాయి. యూపీఐ లావాదేవీలు జీవితంలో భాగంగా మారాయి. యూపీఐ చెల్లింపులకు ఎలాంటి ఫీజులు లేకపోవడంతో జోరుగా సాగుతున్నాయి. ఈ యూపీఐ లావాదేవీలు రోజువారీ జీవితాన్ని సులభతరం చేశాయి. దాంతో డబ్బును వేగంగా పంపడంతో పాటు తీసుకుకోవడం సాధ్యమవుతున్నది. అయినా, నేటికీ పలు నగరాలు, పట్టణాల్లో జనం ఇంకా ఆన్లైన్ చెల్లింపుల కంటే నగదు చెల్లింపులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు అవసరమైతే నగదును తీసుకునేందుకు బ్యాంకులు, ఏటీఎంలను ఆశ్రయిస్తుంటారు. అయితే, నగదు అవసరమైతే నెలకు ఎన్నిసార్లు తమ బ్యాంకు ఖాతా నుంచి డబ్బును విత్డ్రా చేసుకునేందుకు ఏమైనా పరిమితులు ఉన్నాయా? అనే అనుమానాలు కలుగుతుంటాయి.

వాస్తవానికి ప్రతీ బ్యాంకుకు దాని సొంత పరిమితులను నిర్దేశిస్తుంటాయి. బ్యాంకులు కొన్ని లావాదేవీలు ఉచితంగా అందిస్తాయి. ఆ తర్వాత ప్రతి విత్డ్రాకు ఛార్జీలు విస్తాయి. ఎస్బీఐ, పీఎన్బీ, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాతా ఉంటే.. సాధారణంగా మూడు నుంచి ఐదుసార్లు ఉచితంగా విత్ డ్రా చేసుకోవచ్చు. అనంతరం ప్రతి లావాదేవీకి రూ.10 నుంచి రూ.20 వరకు ఛార్జీలు విధిస్తారు. ఈ పరిమితి ఏటీఎంలకు సైతం వర్తిస్తుంది. హెచ్డీఎఫ్సీ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి ప్రైవేటు బ్యాంకులు తమ కస్టమర్లకు ఐదుసార్లు ఉచిత నగదు ఉపసంహరణకు అవకాశం ఇస్తుంది. అయితే, మీరు మీ బ్యాంకు ఏటీఎం నుంచి నగదును విత్డ్రా చేసుకుంటే ఈ పరిమితి దాటిన తర్వాత ఛార్జీలు ఎక్కువగా విధిస్తాయి.

ఒక్కో బ్యాంకు ఒక్కో విధంగా చార్జీ విధిస్తుంటాయి. నగరం, పట్టణాన్ని బట్టి ఈ రూల్స్ మారుతూ వస్తుంటాయి. మెట్రోపాలిటన్ ప్రాంతాల్లోని ఏటీఎంల లావాదేవీ పరిమితులు తక్కువగా ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో, బ్యాంకులు కస్టమర్లకు మరింత సౌలభ్యాన్ని అందిస్తాయి. కాబట్టి వారు నగదు తీసుకునే ప్రతిసారీ పట్టణానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఇది గ్రామీణ వినియోగదారులకు సౌలభ్యాన్ని అందిస్తుంది. నగదు ఉపసంహరణ పరిమితులు ఏటీఎంలకు మాత్రమే కాకుండా బ్యాంకు శాఖలకు వర్తిస్తాయి. కొన్ని బ్యాంకులు నెలకు మూడు ఉచిత కౌంటర్ ఉపసంహరణలను అనుమతి ఇస్తున్నాయి. ఆ తర్వాత సర్వీస్ చార్జ్‌లు వర్తింపజేస్తాయి. ఇది ప్రతి బ్యాంకు నియమాల ప్రకారం మారుతూ వస్తుంది. మొత్తం నగదు, నగదు ఉపసంహరణ పరిమితి, బ్యాంక్, అకౌంట్ వేరియంట్ బట్టి మారుతుంది.




# ఐదో మ్యాచ్ వర్షార్పణం..

టీ20 సిరీస్ విజేతగా టీమిండియా..



**బ్రిస్బేన్:** ఆసియా కప్ ఛాంపియన్ భారత జట్టు మరో పొట్టి సిరీస్ పట్టేసింది. ఆస్ట్రేలియాతో జరగాల్సిన చివరి టీ20 వర్షార్పణం కావడంతో 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది టీమిండియా. గబ్బాలో భారత ఇన్నింగ్స్ 4.5 ఓవర్ వద్ద అంతరాయం కలిగించిన వర్షం.. ఎంతకూ తగ్గకపోవడంతో అంపైర్లు చివరకు ఆటను రద్దు చేశారు. దాంతో.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు విజయాలు సాధించిన సూర్యకుమార్ యాదవ్ బృందం విజేతగా నిలిచింది.

పొట్టి క్రికెట్‌లో తమకు తిరుగులేదని భారత జట్టు మరోసారి చాటుకుంది. ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ (2-1) చేజారినా.. తమకు కొట్టినపిండి అయిన టీ20ల్లో కంగారూ టీమ్‌కు షాకిచ్చింది టీమిండియా. తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా.. రెండో టీ20లో ఆతిథ్య జట్టు గెలిచి సిరీస్ ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే.. కాంబినేషన్‌లో మార్పులు చేసుకున్న టీమిండియా.. వరుసగా రెండు మ్యాచుల్లో కంగారూలకు చెక్ పెట్టింది. పేసర్ అర్ష్‌దీప్ సింగ్, ఓపెనర్ అభిషేక్ శర్మలు మెరవడంతో మూడో మ్యాచ్‌లో.. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ గొప్పగా రాణించడంతో నాలుగో టీ20లో మార్ష్ సేనను మట్టికరిపించింది. నిర్ణయాత్మకమైన ఐదో మ్యాచ్ వర్షార్పణం కావడంతో 2-1తో ఆధిక్యంలో ఉన్న టీమిండియాను విజేతగా ప్రకటించారు.

### 4.5వ ఓవర్లో

నాలుగో టీ20లో భారీ విజయంతో సిరీస్‌లో ముందంజ వేసిన భారత్.. ఐదో మ్యాచ్‌లోనూ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ(23 నాటౌట్), శుభ్‌మన్ గిల్(29 నాటౌట్)లు బౌండరీలతో విరుచుకుపడి శుభారంభమిచ్చారు. అయితే.. 4.5వ ఓవర్లో భారీగా ఉరుములు, మెరుపులు కారణంగా మ్యాచ్‌ను నిలిపివేశారు అంపైర్లు. ఆ కాసేపటికే వర్షం పడడంతో పిచ్‌ను సిబ్బంది కవర్లతో కప్పేశారు. కొద్ది సేపటికి తగ్గినట్టే తగ్గిన వాన మళ్లీ జోరందుకోవడంతో మ్యాచ్ నిర్వహణపై సందేహాలు నెలకొన్నాయి. సిరీస్ ఆసాంతం అద్భుతంగా ఆడిన అభిషేక్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. గత మూడేళ్లలో ఆసీస్ సొంతగడ్డపై టీ20 సిరీస్ కోల్పోవడం ఇది నాలుగోసారి. మూడు పర్యాయాలు టీమిండియా చేతిలోనూ ఆ జట్టుకు పరాభవం ఎదురవ్వడం గమనార్హం.

# టీ20ల్లో నయా థౌజండ్‌వాలా..

సరికొత్త చరిత్ర సృష్టించిన అభిషేక్..!



**బ్రిస్బేన్:** టీ20ల్లో వీరబాదుడుకు కేరాఫ్ అయిన అభిషేక్ శర్మ మరో రికార్డు నెలకొల్పాడు. ఆస్ట్రేలియా పర్యటనలో దంచికొడుతున్న అభిషేక్ పొట్టి క్రికెట్‌లో వెయ్యి పరుగుల మైలురాయిని అధిగమించాడు. తక్కువ ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సాధించిన రెండో భారత బ్యాటర్‌గా ఈ లెఫ్ట్ హ్యాండర్ రికార్డు సృష్టించాడు. టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. విరాట్ 27 ఇన్నింగ్స్‌ల్లో 1,000 రన్స్ పూర్తి చేసుకోగా.. అభిషేక్ 28 ఇన్నింగ్స్‌ల్లో ఈ మార్క్ చేరుకున్నాడు. పొట్టి క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న అభిషేక్ శర్మ పరుగుల ప్రవాహం కొనసాగుతోంది. ఐపీఎల్ విధ్వంసాన్ని అంతర్జాతీయ మ్యాచుల్లోనూ చూపిస్తున్న అభి.. ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 1,000 పరుగులు సాధించాడు. కోహ్లీ టాప్‌లో ఉండగా.. కేఎల్ రాహుల్ (29 ఇన్నింగ్స్‌లు), సూర్యకుమార్ యాదవ్(31 ఇన్నింగ్స్‌లు), రోహిత్ శర్మ(40 ఇన్నింగ్స్‌లు)లు టాప్-5లో ఉన్నారు. బంతుల పరంగా చూస్తే అభిషేక్‌దే అగ్రస్థానం.

ఈ డాషింగ్ బ్యాటర్ 528 బంతుల్లో వెయ్యి పరుగులు అందుకున్నాడు. సూర్యకుమార్ 573 బంతుల్లో, ఇంగ్లండ్ చిచ్చరపిడుగు ఫిల్ సాల్ట్ 599 బంతుల్లో ఈ ఫీట్ సాధించారు. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ 604 బంతుల్లో, ఆండ్రూ రస్సెల్(వెస్టిండీస్), ఫిన్ అలెన్(న్యూజిలాండ్)లు 609 బంతుల్లో వెయ్యి క్లబ్‌లో చేరారు.

# మరోసారి రిస్కీ షాట్..

రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడిన పంత్..!



**న్యూఢిల్లీ:** టీమిండియా టెస్టు స్పెషలిస్ట్ రిషభ్ దక్షిణాఫ్రికా సిరీస్‌కు ముందే మరోసారి గాయపడ్డాడు. పాదం గాయం నుంచి కోలుకుని భారత ఏ జట్టు కెప్టెన్‌గా ఎంపికైన పంత్.. రెండో అనధికారిక టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో రిస్కీ షాట్లతో మూల్యం చెల్లించుకున్నాడు. దక్షిణాఫ్రికా ఏ పేసర్లను ఎదుర్కొనే క్రమంలో పలుమార్లు బంతి తగిలించుకున్నాడీ హిట్టర్. సఫారీ పేసర్ సెపో మొరెకీ ఓవర్లో మూడుసార్లు పంత్ శరీరం, హెల్మెట్‌కు బంతి బలంగా తగిలడంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాల్సి వచ్చింది.

మొదటి అనధికారికి టెస్టులో మెరుపు అర్ధ శతకంతో ఫామ్ చాటుకున్న పంత్.. రెండో మ్యాచ్‌లోనూ దంచేయాలనుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ కేఎల్ రాహుల్(27) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన పంత్ తనదైన స్టయిల్లో దూకుడుగా ఆడాడు. తొలి మూడు బంతులను 4, 4 ,6 గా మలిచిన పంత్‌ను కట్టడి చేసేందుకు సఫారీ పేసర్లు షార్ట్ పిచ్ బంతులు సంధించారు. దాంతో.. పంత్ కాస్త నెమ్మదించాడు.

అయితే.. సెపో మొరెకీ వేసిన 34వ ఓవర్లో బంతి మూడు సార్లు శరీరం, హెల్మెట్‌కు తగలడంతో నొప్పిని భరిస్తూనే పంత్ ఆట కొనసాగించాడు. కానీ, అతడు మరోసారి తీవ్రంగా గాయపడకుండా చూడాలనే ఉద్దేశంతో కోచ్ హ్రిషికేశ్ కనికర్, ఫిజియోలు వెనక్కి పిలిచారు. దాంతో.. రిటైర్డ్ హర్ట్‌గా పంత్ మైదానం వీడాడు. అప్పటికి ఈ డాషింగ్ బ్యాటర్ 22 బంతుల్లో 17 పరుగులు చేశాడు.

సిక్సర్‌తో హాఫ్ సెంచరీ

డ్రెస్సింగ్ రూమ్‌లో కాసేపు విశ్రాంతి తీసుకున్న పంత్.. హర్ష్ దూబే(84) వికెట్ పడ్డాక ఔటయ్యాక క్రీజులోకి వచ్చాడు. సెంచరీ వీరుడు ధ్రువ్ జురెల్ (127 నాటౌట్)తో కలిసి ఆధిక్యాన్ని నాలుగొందలు దాటించాడు. సిక్సర్‌తో హాఫ్ సెంచరీ సాధించిన అతడు.. సిమండ్స్ ఓవర్లో పెద్ద షాట్ ఆడబోయాడు. కానీ, టైమింగ్ కుదరక వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. ఆ వెంటనే భారత ఏ జట్టు 382-7 వద్ద రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

జురెల్ అజేయ శతకం.. పంత్ మెరుపు అర్ధ శతకంతో ప్రత్యర్థి ముందు 417 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది టీమిండియా. తొలి ఇన్నింగ్స్‌లో 119 కేఅ ఆరు వికెట్లు పడిన వేళ వీరోచిత శతకం(132 నాటౌట్)తో జట్టును ఆదుకున్న జురెల్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీతో చెలరేగి భారీ ఆధిక్యాన్ని అందించాడు.

# ఆసియా కప్ వివాదం ముగిసినట్టే..!

పరిష్కారానికి ప్రత్యేక కమిటీని వేసిన ఐసీసీ..!

**న్యూఢిల్లీ:** భారత్-పాకిస్తాన్ మధ్య తలెత్తిన ఆసియా కప్ వివాదాన్ని పరిష్కరించేందుకు ఐసీసీ ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఒమన్ క్రికెట్ బోర్డు చైర్మన్ పంకజ్ ఖిమ్జీ నేతృత్వం వహించనున్నారు. గతంలో పలు వివాదాల సమయంలో ఆయన మధ్యవర్తిత్వం వహించారు. ఓ నివేదిక ప్రకారం.. ఐసీసీ బోర్డు సమావేశంలో బీసీసీఐ ఆసియా కప్ ట్రోఫీ వివాదాన్ని లేవనెత్తింది. దాంతో ఐసీసీ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్‌లో పాక్‌పై భారత్ విజేతగా నిలిచింది. అయితే, పీసీబీ, ఏసీసీ చైర్మన్‌గా ఉన్న మొహ్సిన్ నఖ్వీ ట్రోఫీని ప్రదానం చేసేందుకు వేదికపైకి రాగా.. టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ట్రోఫీ తీసుకునేందుకు నిరాకరించాడు.

నఖ్వీ పాక్ హోం మంత్రిగా కొనసాగుతుండడంతో ట్రోఫీని అందుకునేది లేదని స్పష్టం చేశాడు. భారత్‌లో ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడంలో ఆయన పాత్రపై అభ్యంతరాలు వ్యక్తం ట్రోఫీని అందుకునేందుకు సూర్య నిరాకరించినట్లు నివేదికలు తెలిపాయి. ఏసీసీ అధ్యక్షుడిగా ట్రోఫీని ప్రదానం చేసే అధికారం తనకు మాత్రమే ఉందని నఖ్వీ స్పందించగా.. ఆ తర్వాత ట్రోఫీ లేకుండానే టీమిండియా సంబురాలు చేసుకుంది. దాంతో నొచ్చుకున్న నఖ్వీ ఆసియా కప్, మెడల్స్‌ను తీసుకెళ్లిపోయారు. ఐసీసీ బోర్డు సమావేశంలో బీసీసీఐ ఈ అంశాన్ని లేవనెత్తింది. సమావేశంలో వాతావరణం స్నేహపూర్వకంగా ఉండగా.. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా వంటి బోర్డులు రెండుదేశాలను శాంతింప చేసేందుకు ప్రయత్నించాయి.





ట్రోఫీని వివాదాన్ని పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీని వేసేందుకు అంగీకరించినట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి పీసీబీ చైర్మన్ నఖ్వీ సైతం హాజరయ్యారు. భారత్, పాక్ రెండు క్రికెట్ ప్రపంచంలో కీలకమైన సభ్యదేశాలని.. విభేదాలను పరిష్కరించేందుకు ఐసీసీ బోర్డు అంగీకరించదని మీడియా నివేదికలు తెలిపాయి. పాక్ సెనేట్ కీలక సమావేశం వాయిదా పడినందున.. నఖ్వీ చివరి నిమిషంలో దుబాయిలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ట్రోఫీ వివాదాన్ని పరిష్కార బాధ్యతలను ఒమన్ క్రికెట్ బోర్డు చైర్మన్ ఖిమ్జీపై ఉండగా.. రెండుదేశాల బోర్డులతో ఆయనకు సత్సంబంధాలున్నాయి. దాంతో వివాదం సమసిపోతుందని ఐసీసీ భావిస్తున్నది.

## అవును.. విజయ్‌ను పెళ్లి చేసుకోబోతున్నా

### నాకోసం నిలబడే వ్యక్తి కావాలనుకున్నా: రష్మిక



**టాకీస్:** ఎట్టకేలకు రష్మిక తన పెళ్లిపై క్లారిటీ ఇచ్చారు. నటుడు దేవరకొండ విజయ్‌ను విశాహం చేసుకో బోతున్నట్లు చెప్పారు. అలాగే ఎంగేజ్‌మెంట్ విషయంలో మీరు అనుకున్నదే నిజమని ఓప్పుకున్నారు. తన కోసం యుద్ధం చేసే జీవిత భాగస్వామి కావాలని నటి రష్మిక తాజాగా ఓ చిట్‌చాట్‌లో తెలిపారు. వరుస సినిమాలు, విజయ్ దేవరకొండతో నిశ్చితార్థం వార్తలతో గతకొన్ని రోజులుగా నిత్యం రష్మిక ట్రెండింగ్‌లో ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా ఒక యూట్యూబ్ ఛానల్ చిట్‌చాట్‌లో ఆమె పాల్గొన్న సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆసక్తికర సమాధానం చెప్పారు. తన భాగస్వామి ఎలా ఉండాలని కోరుకుంటున్నారో చెప్పాలని ఒక అభిమాని కోరగా రష్మిక నవ్వుతూ దానికి సమాధానమిచ్చారు. ప్రపంచం మొత్తం తనకు వ్యతిరేకంగా ఉన్నా కూడా తన కోసం నిలబడే జీవిత భాగస్వామి కోసం వెతుకుతున్నట్లు వివరించారు. నిజాయితీగా చెప్పాలంటే నన్ను లోతుగా అర్థం చేసుకునే వ్యక్తి. ప్రతి విషయాన్ని నావైపు నుంచి ఆలోచిస్తూ అర్థం చేసుకోవాలి. అన్ని పరిస్థితులను ఎదుర్కొనే వ్యక్తి.. ఎలాంటి దాన్నైనా అర్థం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిని నేను కోరుకుంటున్నాను. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి, నాకోసం యుద్ధం చేయగల వ్యక్తి కావాలి. అలాంటి భాగస్వామి కోసం నేను ఎంత దూరమైనా వెళ్తాను. యుద్ధంలో తూటాకైనా ఎదురెళ్తా అని రష్మిక తెలిపారు. ఒకవేళ మీరు డేట్ చేస్తే ఎవరితో చేస్తారు? పెళ్లి చేసుకుంటే ఎవరిని చేసుకుంటారు? అని మరో అభిమాని అడగ్గా.. డేట్ చేస్తే యానిమేషన్ క్యారెక్టర్ నరుటోతో చేస్తా. ఎందుకంటే నాకు నరుటో పాత్ర చాలా ఇష్టం. పెళ్లి చేసుకుంటే విజయ్‌ని చేసుకుంటా అని చెప్పారు. ఈ సమాధానంతో ఆడియన్స్ అందరూ పెద్దగా అరుస్తూ కంగ్రాట్స్ చెప్పారు. రష్మిక థాంక్స్ చెప్పారు.

## రాజ్‌తరుణ్ హీరోగా చిరంజీవ

### దర్శకత్వ కోరిక తీర్చుకున్న జబర్దస్త్ అదిరే అభి




**టాకీస్:** 'జబర్దస్త్'తో బుల్లితెర ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన వేణు, ధన్‌రాజ్‌లాంటి కమెడియన్లు.. దర్శకులుగా ఎమోషనల్ చిత్రాలు తీసి మెప్పించారు. అదే షోతో సందడి చేసిన అదిరే అభి (అభినయ కృష్ణ) డైరెక్టర్ కావాలన్న తన ఎన్నో ఏళ్ల కలను 'చిరంజీవ' తో నెరవేర్చుకున్నారు. సోషియో ఫాంటసీ టచ్‌తో ఎంటర్‌టైనర్‌గా దాన్ని రూపొందించారు. రాజ్‌తరుణ్ హీరో, కుషిత కల్లపు హీరోయిన్‌గా తీసిని మూవీ ఓటీటీ 'ఆహా' లో రిలీజ్ అయింది. హైదరాబాద్‌కు చెందిన శివ (రాజ్‌తరుణ్)కు దూకుడెక్కువ. ఆ వేగమే అతడిని అంబులెన్స్ డ్రైవర్‌ని చేస్తుంది. ఇతరుల ఆయుష్షు ఎప్పటి వరకూ ఉందో తెలుసుకునే పవర్ తనకు ఉందని ఓ రోడ్డు ప్రమాదంతో శివకు అర్థమవుతుంది. దాన్ని 'క్యాష్' చేసుకుని, తన అప్పులన్నీ తీర్చేయాలని నిర్ణయించుకుంటాడు. కార్పొరేటర్ సత్తు పహిల్వాన్‌తో ఓ డీల్ మాట్లాడతాడు. ఆ ఒప్పందమేంటి? డబ్బు కోసం అలా చేయడం తప్పని భావించిన తర్వాత శివ ఏం చేశాడు? ఓ భారీ ప్రమాదం నుంచి ఎంతోమందిని రక్షించేందుకు ప్రయత్నించిన శివకీ, స్థానిక ఎమ్మెల్యేకీ ఉన్న వైరం ఏంటి? తోటి మనిషి ఆయుష్షు ఎంతో చెప్పే వరం శివకు ఎలా వచ్చింది? తదితర అంశాల సమాహారమే 'చిరంజీవ'. అకాల మరణం చెందిన హీరో నరకానికి వెళ్లి.. యముడిని ప్రశ్నించడాన్ని, యముడే భూమ్మీదకు రావడాన్ని కొన్ని చిత్రాల్లో చూశాం. 'చిరంజీవ' కూడా అలా యముడి చుట్టూ అల్లుకున్న కథే. కానీ, ఇందులో ఆయన గురించి చెప్పే సన్నివేశాలే తప్ప ప్రత్యేకంగా పాత్రంటూ ఉండదు. మనిషి చావుకు నిజంగా యమధర్మారాజే కారకుడా? అని ప్రశ్నించుకునేలా చేస్తుందీ చిత్రం. హీరో పొందిన వరం గురించి సినిమా ప్రారంభంలోనే తెలుస్తుంది.

## మనసు బాగోలేకపోతే శ్మశానానికి వెళ్లి వస్తా..

### 'పొలిమేర' బ్యూటీ కామాక్షి భాస్కర్ల



**టాకీస్:** మనసు బాలేకపోతే బయటికి షికారుకి వెళ్లి రావడం.. సినిమాకి వెళ్లడం. ట్రావెలింగ్‌కి వెళ్లడం చూస్తూ ఉంటాం. కానీ తన మనసు బాలేగకపోతే శ్మశానానికి వెళ్లి వస్తానని చెబుతుంది టాలీవుడ్ బ్యూటీ కామాక్షి భాస్కర్ల. పొలిమేర సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ తన సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొనగా.. ఈ ఇంటర్వ్యూలో తన పర్సనల్ లైఫ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కామాక్షి మాట్లాడుతూ.. నా మనసు బాలేనప్పుడు బాగా డిప్రెషన్‌లోకి వెళ్లినప్పుడు శ్మశానానికి వెళ్లి వస్తుంటా. అక్కిడికి వెళితే ఒక తెలియని ప్రశాంతత దొరుకుతుంది. చాలా ఎనర్జీ వస్తుంది. మైండ్ కూడా ఎంతో రిలీఫ్‌గా అనిపిస్తుందంటూ ఈ భామ చెప్పుకొచ్చింది. అయితే కామాక్షి మాటలను విన్న నెటిజన్లు.. హారర్ సినిమాలు చేసి చేసి కామాక్షి అందులోనే జీవిస్తుందంటూ కామెంట్లు చేస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే.. కామాక్షి ప్రస్తుతం అల్లరి నరేష్‌తో కలిసి '12ఎ రైల్వే కాలనీ' అనే థ్రిల్లర్ సినిమాలో నటిస్తుంది. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. నాని కాసరగడ్డ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు.

## కశ్మీర్‌లో వాలిన అనుమానం పక్షి

**టాకీస్:** సిద్దు జొన్నలగడ్డ నటించిన డీజే టిల్లు సినిమాతో రైటర్ కమ్ డైరెక్టర్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు విమల్ కృష్ణ. తాజాగా విమల్ కృష్ణ మరో క్రేజీ ఎంటర్‌టైనర్‌తో వినోదాన్ని అందించేందుకు రెడీ అవుతున్నాడు. రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న చిత్రం అనుమాన పక్షి. ఈ మూవీ టీం కశ్మీర్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. జీరో




అనుమానంతో కశ్మీర్ షెడ్యూల్ పూర్తయిందంటూ ట్వీట్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా షూటింగ్ లొకేషన్‌లో రాగ్‌మయూర్ అండ్ టీం దిగిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాన్ని చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలకా, రాజేశ్ జగ్‌తియాని, హిరాచంద్ దండ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఆ ఒక్కటి అడక్కు తర్వాత చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌లో వస్తోన్న సినిమా కావడంతో క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఫన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల మ్యూజిక్ కంపోజర్‌గా పనిచేస్తున్నాడు. ప్రిన్స్ సెసిల్, చరిత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సునీల్ కుమార్ నామా సినిమాటోగ్రఫర్‌గా వ్యవహరిస్తున్న ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

## 'అఖండ 2'.. తాండవం సాంగ్ ప్రోమో విడుదల

**టాకీస్:** నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను, మ్యూజిక్ డైరెక్టర్ తమన్ కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం



అఖండ. ఇప్పుడు ఇదే చిత్రానికి సీక్వెల్ రాబోతుంది. 'అఖండ 2: తాండవం' అంటూ ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మూవీ నుంచి ప్రమోషన్స్ షురూ చేసింది చిత్రయూనిట్. తాజాగా ఈ మూవీ నుంచి తాండవం సాంగ్ ప్రోమోను విడుదల చేసింది.

## చక్‌దే ఎక్స్‌ప్రెస్ విడుదలలో కదలిక

**టాకీస్:** మహిళల వన్డే ప్రపంచ కప్‌ను టీమ్‌ఇండియా సగర్వంగా సొంతం చేసుకొని చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో అనుష్క శర్మ నటించిన 'చక్‌దే ఎక్స్‌ప్రెస్' మరోసారి చర్చనీయాంశమవుతోంది. అనుష్క శర్మ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా షూటింగ్ ఏడేళ్ల క్రితం పూర్తయినా ఇప్పటివరకూ విడుదలకు నోచుకోలేదు. అయితే, ఇటీవల మన అమ్మాయిలు ప్రపంచ కప్ సాధించిన నేపథ్యంలో ఈ సినిమా విడుదల చేయాలని అభిమానులు పోస్టులు పెట్టడంతో.. నిర్మాతలు దీన్ని రిలీజ్ చేయాలని




భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా విడుదల కోసం నెట్‌ఫ్లిక్స్‌తో చిత్రబృందం చర్చలు కూడా జరిపినట్లు తెలుస్తోంది. 'చక్‌దే ఎక్స్‌ప్రెస్' కోసం అనుకున్న దానికంటే బడ్జెట్ ఎక్కువవడంతో అభిప్రాయ భేదాలు వచ్చి సినిమా విడుదల ఆగిపోయిందని ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే వన్డే ప్రపంచకప్‌ను భారత అమ్మాయిలు గెలుచుకున్న నేపథ్యంలో దీన్ని ఇప్పుడు విడుదల చేస్తే ఆదరణ సొంతమవుతుందని చిత్రబృందం భావించినట్లు తెలుస్తోంది.

## రజనీకి అరుదైన గౌరవం

### అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో సన్మానం

**టాకీస్:** భారతీయ చలనచిత్ర పరిశ్రమకు సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించిన సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. ఇటీవల నట జీవితంలో 50 ఏళ్ల ఘన ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా 56వ అంతర్జాతీయ చలనచిత్ర ఉత్సవం ముగింపు వేడుకలో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు. ఈ సన్మానం ఐఎఫ్ఎఫ్ఐకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా.. గోవా వేదికగా నవంబర్ 20 నుంచి 28 వరకు ఈ వేడుక జరుగనుంది. బస్ కండక్టర్‌గా జీవితం ప్రారంభించిన శివాజీ రావు గైక్వాడ్ అలియాస్ రజనీకాంత్? 1975లో లెజెండరీ దర్శకుడు కె. బాలచందర్ రూపొందించిన 'అపూర్వ రాగంగళ్' చిత్రంతో నట జీవితాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా, తనదైన స్టైల్‌తో, విలక్షణమైన పాత్రలతో కోట్లాది మంది అభిమానుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. తన యాక్షన్, స్టైలింగ్‌తో ఇండియా అంతటా సూపర్‌స్టార్‌గా గుర్తింపు సాధించాడు. ఇక ఈ ఎఈఈఎ వేడుకల్లో గురు దత్, రాజ్ ఖోస్లా, రిత్విక్ ఘటక్, పి. భానుమతి, భూపేన్ హజారికా వంటి పలు దిగ్గజ కళాకారుల శత జయంతి వేడుకలు కూడా జరగనున్నాయి.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.